# మిసిమి

మాస పత్రిక

అక్టోబర్ 2007



రూ. 8/-



చిత్రకారిణి: అమృతాషేర్‌గిల్ (1913-1941)



ముగ్గురమ్మాయిలు

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 18 | అక్టోబర్ 2007 | సంచిక 10

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

రైతుల సహయాత్రికుడు ముఖోపాధ్యాయ — మూలం : సుభాష్ ముఖోపాధ్యాయ
అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి

కాలాన్ని ఎంత నిక్కచ్చిగా కొలవగలం? — డా॥ చాగంటి కృష్ణకుమారి

అమృత మూర్తి - అమృతాషేర్‌గిల్ — కాండ్రేగుల నాగేశ్వరరావు

కాళోజీ కవిత్వం - వ్యక్తిత్వం — డా॥ మలయశ్రీ

నాదు జాతి, నాదు దేశము, నాదు భాష — డా॥ అద్దంకి శ్రీనివాస్

విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : అమృతాషేర్‌గిల్ స్వీయ చిత్రం

చిత్రకారిణి : అమృతాషేర్‌గిల్

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimi@kalajyothi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# తెలుగులో గాంధీ

యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్‌చే ఆమోదించబడి గత రెండు సంవత్సరాలుగా క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అవగాహనా సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తూ మహాత్మాగాంధీ సిద్ధాంతాల అధ్యయనం, వ్యాపకం సాగిస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం గాంధీజీపై తెలుగులో వచ్చిన సమాచారాన్ని సమగ్రంగా సేకరించి పరిశోధనకు ఉపకరించేలా ఉంచాలని సంకల్పించింది. ఇందులో భాగంగా స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ, ఆ తర్వాత గాంధీపై తెలుగులో వచ్చిన, వస్తోన్న గ్రంథాలను సేకరించే ప్రయత్నం చేస్తున్నది. అంతేకాక గాంధీపై తెలుగులో వచ్చిన వచన కవిత్వం, గేయాలు, పాటలు, బుర్రకథలు, హరికథలు, వీధి నాటకాలు, సినిమా పాటలు, కార్టూనులు మొదలైన వాటిని సేకరించి సంపుటాలుగా ముద్రించే ప్రయత్నంలో ఉంది. వీటితో పాటు 'ఆంధ్రప్రదేశ్‌లో గాంధీ' అనే అంశంపై జరిగిన, జరుగుతున్న విస్తృత పరిశోధన విధానాలను కూడా అధ్యయన కేంద్రాలలో అందరికీ అందుబాటులో ఉంచాలని సంకల్పించింది.

అందువల్ల దీనికి సంబంధించిన సమాచారం అచ్చుప్రతులు, లిఖిత ప్రతులు ఆడియో వీడియోలు, ఫోటోలు మొదలైన ఏరూపంలో ఉన్నా పంపి సహకరించమని అధ్యయన కేంద్రం విజ్ఞప్తి చేస్తున్నది. ఉపయోగానంతరం వాటిని మళ్ళీ జాగ్రత్తగా తిప్పి పంపే బాధ్యతను కేంద్రం వహిస్తుంది.

ఇది బృహత్తరమైన కార్యక్రమం. సహకరించాలని అందరికీ విజ్ఞప్తి.

మీ ప్రతులను పంపవలసిన చిరునామా:

ప్రోగ్రాం కోఆర్డినేటర్
గాంధీ అధ్యయన కేంద్రం
ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్టణం
ఫోన్ : 0891-2844801
98492 37813



సుభాష్ ముఖోపాధ్యాయ
(1919-2003)

# రైతుల సహయాత్రికుడు ముఖోపాధ్యాయ

1991వ సం॥ జ్ఞానపీఠ్ పురస్కార
స్వీకారోపన్యాసంలోని ముఖ్యాంశాలు
(బెంగాలీ నుండి హిందీలోకి అనువదింపబడిన
ఉపన్యాసానికి తెలుగు అనువాదం)



అనువాదం : **డా॥ జె. లక్ష్మిరెడ్డి**

'స్వాగతం' అనేది చాలా లాంఛనప్రాయంగా వాడే పదం. మీరందరు ఈ పట్టణానికి ఇంత శ్రమపడి వచ్చి మీ పాద స్పర్శతో పవిత్రం చేసి, నా చేతుల్లో పురస్కారం ఉంచి బెంగాలీ భాషను సత్కరించారు. ఇందుకు నేను అందరి తరపున కృతజ్ఞత తెలుపుతున్నాను. నా తండ్రి - తాతల గ్రామమై ఉంటే మీరందరూ కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు, కూర్చోడానికి పీటలు ఇచ్చేవాణ్ణి. కానీ దేశ విభజన తర్వాత ఇల్లంటూ మాకు ఏదీలేదు. కలకత్తా నగరమే తన ఒడిలో చోటివ్వకుండా ఉండి ఉంటే నేనేమైపోయే వాణ్ణో చెప్పడం కష్టం. పూలతో పాటు ఉండే ముండ్లంటే నాకు భయం. కానీ చేప ముండ్ల పాలిట నేను సాక్షాత్తు యముణ్ణి. ఇంట్లో పిల్లల గొంతులో చేపముల్లు ఇరుక్కుపోయినప్పుడు నా పిల్లి బుద్ధి (మత్స్య ప్రియులైన బెంగాలీలు భోజనం చేసేప్పుడు చేప ముల్లులన్నీ పిల్లికి వేస్తారు. పిల్లి ఒక్క ముల్లు కూడా గొంతులో కుచ్చుకోకుండా తినేస్తుంది. ఈ నేర్పునే పిల్లి బుద్ధి, అని అంటారు) కారణంగా అందరూ నా కాళ్ళు పట్టుకొనే వారు. 'పిల్లి అదృష్టం వల్ల ఉట్టి ఊడిపడింది' అనే సామెత ఎంత సమంజసమైందో, నన్ను చూస్తే మీకు బాగా తెలిసిపోతుంది.

చిన్నతనంలో నా బుద్ధి ఇంత చురుకుగా ఉండేది కాదు. మా ఉపాధ్యాయులు నన్ను దురదృష్ట వంతుడనీ, కష్టాలు రాసి ఉన్నాయనీ, అంటూ ఉండే వారు. ఆ తర్వాత ఒక సంఘటన జరిగింది. చూనాపుకూర్ లేన్ ఆటల పోటీల్లో హైజంప్, లాంగ్ జంప్‌లలో ప్రథమస్థానం పొందిన తర్వాత, నేను సైకిల్ స్లో రేసులో పాల్గొన్నాను. పందెం ప్రారంభం అయిన కొద్ది సేపటికే నేను అందరి కంటే ముందుకు వెళ్ళి పోయాను. ఇక నేనీ పందెం గెలిచే అవకాశం లేదని నాకనిపించింది. అప్పుడే అక్కడున్న వాళ్ళ అరుపులు నా చెవిన పడ్డాయి. "బక్ అప్... బక్ అప్..." నేను వెనక్కు తిరిగి చూస్తే పోటీలో పాల్గొంటున్న వాళ్ళంతా సమతూకం నిలుపుకోలేక ఒకరి తర్వాత ఒకరు కింద పడిపోతూ ఉండడం కనిపించింది. అప్పుడు మెల్ల మెల్లగా పెడల్ ఆడిస్తూ ఆ స్లో రేసులో కూడా ప్రథముడుగా నిలిచాను. పథకాలు తగినన్ని లేనందువల్ల నాకు ప్రథమ స్థానం పొందిన విద్యార్థి బిరుదుతో పాటు బంతిపూల మాల ఇచ్చారు. ఇంటికి వచ్చి అద్దం ముందు నిలబడినప్పుడు నా అదృష్టం అంత హీనం కాదనిపించింది.

నా మూడు తరాల వాళ్ళలో డెబ్బైరెండు మార్కులు ఎవరికీ రాలేదు. నేను ఆడుతూ - పాడుతూనే డైబ్బై మూడు మార్కులు తెచ్చుకున్నాను. ఓర్పు ఉంటే మంచి ఫలితం తప్పక లభిస్తుందనే మాట ఒప్పుకున్నా కూడా ఉట్టి ఊడి పడే మాట ఉండనే ఉంటుంది. ఇతర భారతీయ భాషల గురించి నాకు తెలియదు. కానీ, బెంగాలీ సాహిత్య స్వయంవర సభకు మాత్రం రాజపుత్రుల (ఉన్నత వర్గాలకు చెందిన వారి) కే పిలుపు అందుతూ ఉండేది. నన్ను చూడమని ఒకరంటే, నన్ను చూడమని మరొకరంటారు. ఎవరూ ఎవరికీ తీసిపోరు. ఇక రాజకుమారి ముందుకు సాగిపోక తప్పదు కదా! -

---

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులుగా పదవీ విరమణ చేశారు. నివాసం న్యూఢిల్లీ.

కళ్ళు మూసుకొనే కాదు, అదృష్ట దేవత పైన భారం వేసి కూడా. అలా చేయకపోతే ఆమె ఎందరినో కాదని ఒకరి మెడలో వరమాల వేయగలిగేదా? అదృష్టం మనిషిని ఆకాశం దాకా తీసుకుపోతుంది. కానీ విమాన యాత్రికునిలాగా అతడు కిందికి దిగి రావలసి కూడా ఉంటుంది. ఎగరడం, దిగడంలో ఎప్పుడేమి జరుగుతుందో .... అనే బెరుకు మనసులో పుడుతూనే ఉంటుంది. సురక్షితంగా కిందికి దిగి రాగలనా, లేక విమానం ధ్వంసమై పైనే కాలి బొగ్గయి పోతానా? దౌర్భాగ్యం క్షణ - క్షణమూ నీడలాగా మనిషి అదృష్టాన్ని వెంటాడుతూ ఉన్నా, ఈ మాట బయటికి ఎవరూ అనలేరు. అదృష్టం వల్ల శుభం, లాభం కలుగుతాయి. కానీ 'వీరభోగ్యా వసుంధరా' అనే సూక్తి ననుసరించి భూమిపైన అతి దృఢంగా కాళ్ళూనిన పౌరుషం గమ్య స్థానం చేర్పించినప్పుడే ఆ శుభ - లాభాలు అత్యంత గౌరవప్రదంగా ఉంటాయి. ఇక నేను నా మాటకొస్తాను... భారత ఉపఖండంలో మేమంతా ఈశాన్య దిశలో ఉండేవాళ్ళం. ఆర్యనాగరికత పటంలో మేమందరమూ అంతేవాసులం. ఆర్య భాషలు మాట్లాడే వాళ్ళు ఈ ప్రాంతాని కొచ్చి ఇక్కడి మూల నివాసులతో మనసా వాచా కర్మణా కలిసిపోయారు. మా రూపు రేఖల్లోనూ, మా భాషలోనూ, ఆచార - వ్యవహారాల్లోనూ ఆ కలయిక ముద్ర, ప్రభావం ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తాయి. మేము పురుషులం అంత అందంగా లేకపోయినా, మా స్త్రీలలో మాత్రం ఒక విశిష్టమైన లావణ్యం ఉంటుంది. మాలో మామూలు కంటే కొంచెం ఎక్కువగానే భావ తీవ్రత ఉంది --క్షణంలో రెచ్చిపోతాం, తర్వాత క్షణంలో శాంతించి కూర్చుంటాం. దేశపు ఒక మూలన నక్కి ఉండడం వల్లనేమో మా చిత్రాల్లో, రంగవల్లుల్లో, హస్తకళల్లో ఆ మునుపటి, తర్వాతి జనజీవనంలోని సమన్వయ ధార నేటికీ ప్రవహిస్తూ కనిపిస్తుంది. తమ ప్రాణాలర్పించి పోషించి, వాటిని బెంగాల్ జనశృతుల్లో సజీవంగా కాపాడిన చండాలురు, తదితర అతి తక్కువ కులాల వారు కూడా మాకు వంద్యులే.

వెయ్యి సంవత్సరాల మునుపు ఈ ప్రాంత ప్రజలు ఏ భాష మాట్లాడే వారో, తెలుసుకోవడానికి మార్గం లేదు. అయితే ఎన్నో పదాలు అంతరించి మరుగున పడిపోయిన తర్వాత కూడా మిగిలి ఉన్న పదాల్లో ఆనాటి భాష అవశేషాలు మనం చూడవచ్చు. ఆర్య భాష ప్రభావాన్ని మా వాడుకలో మార్చి, చేర్చి, మా మూసలో పోసుకొని, మేము దాన్ని బెంగాలీగా చేసుకున్నాం. కులం, జాతి, వీటిని గురించి పట్టించుకోకుండా ఉపయోగకరమైన పదాలను చేర్చుకొని మేము బెంగాలీ భాష ఆకలిని, దప్పికను తీర్చాం. సాహిత్యంలో కృతకతను తొలగించి మేము మాట్లాడే బెంగాలీ భాషకే సాహిత్య సామ్రాజ్యంలో స్థానం కల్పించాం. సంస్కృతం ఆధిపత్యంలో అణగారిపోతున్న బెంగాలీని రక్షించడానికి పండిత్ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ స్వయంగా ముందుకు వచ్చారు. రవీంద్రనాథ్ నిర్దేశాన్ని కాదని మేము ఈ నాటికీ బెంగాలీ మెడపైన ఇంగ్లీషు కాడిని మోపి ఉన్నామనేది వేరే విషయం.

జీవితం అంతా ధారపోసి కూడా ఎవరూ ఏది ఎప్పుడు, ఎలా జరిగిందో, ఖచ్చితంగా చెప్పలేరనే విషయం నాకు తెలుసు. ఈ రోజున్నది నిన్న లేదు. అదేవిధంగా ఈ రోజున్నది రేపుండదు. చరిత్రలో జరిగిన హెచ్చు - తగ్గులకు, అలజడికి సంబంధించిన లెక్కలు సరిచేసేందుకు నేను రాలేదు. పైగా నిరాశ, నిస్పృహలు నిండిన నా గతాన్ని ఈ రోజు ఏకరువు పెట్టడం వల్ల వచ్చే లాభం మటుకు ఏముంటుంది? దానికి బదులు నేను నా జీవిత కథ చెప్పడమే మంచిది. సాహిత్య ప్రపంచంలోకి నేనెలా వచ్చానో మొదట చెప్తాను. చిన్నప్పటి నుండీ, ఇంట్లోని ఇతర సభ్యుల లాగే నేను కూడా బాగా పాడే వాణ్ణి. పంద్రెండేండ్ల ప్రాయంలో నాకు టైఫాయిడు వచ్చింది. తర్వాత నాకు, యమధర్మరాజుకు మధ్య జరిగిన పెనుగులాటలో నేను బ్రతికాను. కానీ, నా కంఠ స్వరం, జ్ఞాపక శక్తి, కంటి చూపు, ఈ మూడింటిపైన దాని ప్రభావం పడింది.

ఆ రోజుల్లో -- ప్రపంచమంతా ఆర్థిక మాంద్య ప్రభావం వ్యాపించి ఉన్నప్పుడు -- మా నాన్నకు ప్రభుత్వోద్యోగం వల్ల వచ్చే జీతంలో కోత పడింది. తర్వాత నడిమి చిన్నాన్న జనపనార ఆఫీసు ఉద్యోగం పోగొట్టుకోగానే మేమంతా పట్టణంలోని దక్షిణ భాగంలో, ఒకటిన్నర గదులున్న అద్దె ఇంట్లోకి వచ్చి చేరాం. ప్రకృతి ఒడిని వదలిపెట్టి కలకత్తా వచ్చినప్పుడు అంతులేని దిగులు, నిరాశతో క్రుంగిపోతున్న బాలున్ని నేను. అక్కడి రోడ్లు అబాలున్ని ఇరుకు ఇంట్లో నుంచి బయటికి తెచ్చి, కన్నీళ్ళు తుడిచి, ఆ కళ్ళల్లో ఇంద్రజాల మహిమ గల కాటుక పెట్టాయి. గాంధీబాబా పిలుపుపైన ఆ రోజుల్లో విదేశీ వస్త్రాలు భగ భగ మండుతూ ఉండేవి. సారాయి దుకాణాల వద్ద పికెటింగ్ జరుగుతూ ఉండేది. ఎర్రటోపీ పోలీసులు ప్రజలను నిరాటంకంగా బాదుతూ ఉండేవారు. అన్ని వార్తా పత్రికలూ మూత పడిపోయాయి. ఇన్ని రోజులు, 'తూర్పు బెంగాల్ వాడ'ని ఎవరిని చిన్న చూపు చూస్తూ ఉండేవారో, ఆ బాలుడిప్పుడు వాడకు వార్తాహరుడుగా మారడంతో, అక్కడి వాళ్ళతణ్ణి ఎంతో ఆప్యాయంగా దగ్గర కూర్చోబెట్టుకొని పట్టణంలోని వింతలు, విశేషాలు అడిగేవారు. ఆ తర్వాత వచ్చాయి, అగ్నిజ్వాలలతో నిండిన రోజులు. తుపాకి గుండ్ల దెబ్బలు తిని, ఉరికంబమెక్కి, నిరాహారదీక్షలు చేసి అమరవీరులు ప్రాణత్యాగం చేస్తూ ఉండినారు. మరో వైపు గుర్రాలెక్కి, కొరడా ఝుళిపిస్తూ వెంటాడుతున్న పోలీసు దళాలు తరిమికొడుతున్నా, ఎప్పుడూ నిర్మానుష్యం కాని దారులు కనిపించేవి.

సెలవుల్లో పల్లెకు వచ్చినప్పుడు చివరన మిఠాయి పెడతారనే ఆశతో 'లక్ఖీర్ పాంచాలీ', 'సత్యపీర్ పాంచాలీ', అనే ధార్మిక, పురాణ గాథలు ఎంతో భక్తి భావంతో వినేవాణ్ణి. రాజశాహీలోని నవగావ్ లో హిందువులు, ముస్లింలు అందరం ఒకే చోట ఉంటూ ఉండే వాళ్ళం. ఈద్ గానీ, దశహరాగానీ, పిల్లలమైన మాకందరికీ సంపూర్ణమైన ఆప్యాయత లభిస్తూ ఉండేది. 'మీలాదే శరీఫ్' రోజుల్లో అయితే ఎర్రవి, నీలి రంగువి కాగితాలు కత్తిరించి మేము స్కూలును అలంకరించే వాళ్లం. లాల్ బాజార్‌లో ఎక్సైజ్ బ్యారక్‌లో మేము ఉంటున్న రోజుల్లో నేను తరుచుగా మా అన్నతో పాటు చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనేవాణ్ణి. అమ్మ, నాన్నతో పాటు బేలూర్ మఠ్ (రామకృష్ణ పరమహంస నివసించిన చోటు)కు కూడా వెళ్ళే వాణ్ణి. వీధిలో మేము ఆడుకునే నేస్తాల్లో బెంగాలీలు, క్రైస్తవులు, ఆంగ్లో - ఇండియన్లు, అందరూ ఉండేవారు. ఆ వీధి - వీధంతా పారసీలు, సింధీలు, యూదులు, ఆర్మెనిక్కులు, వీరితో నిండి ఉండేది. దగ్గరలోనే చైనావారి బస్తీ ఉండేది. ఇక ఇటు సైనిక బేరకుల్లో ఎందరో బెంగాలేతర సైనికులుండే వారు. ఒంటిపైన మట్టి రాసుకొని మేము వాళ్ళతో కుస్తీ పట్లు నేర్చుకునే వాళ్ళం. చాలా మంది అనేక భాషల్లో పరస్పరం సంభాషించుకోవడం నేను విన్నాను. మా అమ్మ తడుముకోకుండా హిందీ, ఒరియా మాట్లాడుతుండేది. మాతృభాషలు మన మనసులను ఎన్నడూ సంకీర్ణం కానివ్వకుండా ఉంచడం ఇందుకొక కారణం. నిజానికి జీవితంలో నేను మరేదో కావాలనుకున్నాను. చిన్న వయసునుండే సన్యాసిని కావాలనే కోరిక మనసులో నాటుకుంది. తర్వాత సైన్యంలో చేరితే బాగుంటుందనుకున్నాను. విని మా అమ్మ అంది, "అరే, అప్పుడు నేనేమైపోవాలి?" అప్పుడు ఆమెకు నేను "ఏం? నిన్ను కావడిలో కూర్చోబెట్టుకొని నాతో తీసుకుపోతాను'' అంటూ నచ్చ జెప్పాను. కొంత కాలం గడిచి నేను పెద్ద అయిన తర్వాత నా ఈ ఉన్నత ధ్యేయం దారి తప్పి వెళ్ళి క్రీడారంగాన్ని ఢీకొంది.

నేను ఏ ఆంతరిక ప్రేరణతోనో చదవడం, రాయడం మొదలు పెట్టలేదు. నేను నా సహాధ్యాయి అన్నను ఎంతో ఈర్ష్యతో చూసే వాణ్ణి. ఒక లిఖిత పత్రిక వాళ్ళకుండేది. అందులో ఏదైనా రాయడానికి వాళ్ళు నన్ను రచనా ప్రపంచంలోకి తోసేశారు. మామూలు ప్రజలు ఏ విధంగా మాట్లాడుకుంటూ ఉంటారో, సరిగ్గా అదే విధంగా ఏదో రాసి, నేనొక రచన తయారు చేశాను. వాళ్ళు కూడా తమ

మిత్రమండలితో పాటు నా వీపు చరిచి, "నీవు గద్యం ఎంతో బాగా రాయగలవు" అని అన్నారు. ఆ ఉత్సాహంతో నేను మరొక రచన చేసేశాను. ఒక రోజు స్కూలంతా నిర్మానుష్యంగా ఉన్నప్పుడు నేను చప్పుడు కాకుండా వెళ్ళి నా రెండు రచనలు స్కూలు పత్రిక పెట్టెలో వేసి వచ్చాను. ఆ తర్వాత నా మెడపైన కూర్చొని సవారీ చేస్తున్న 'రాయాలి' అనే భూతం ఎక్కడో మాయమై పోయినట్లనిపించింది నాకు. అప్పుడు నా వయసు దాదాపు పద్నాలుగేండ్లు. స్కూల్లో ఎండాకాలం సెలవులు మొదలు కాబోతున్నాయి. అక్కడ నగేన్ బాబు సంస్కృతం చెప్పేవాడైనా ఆధునిక చైతన్యం కలిగిన మనిషి. ఒక రోజు స్కూలు బంట్రోతు వచ్చి, అప్పుడప్పుడే ప్రింటు అయి వచ్చిన పత్రికల కట్ట ఒకటి ఆయన బల్ల మీద పెట్టడం మేము విద్యార్థులం చూశాం. ఆయన అందులోంచి ఒక పత్రిక తీసి, పుటలు తిరగ వేస్తూ చదవడం మొదలు పెట్టారు. ఇటు దాని చాటున మేము మా భాగోతం చెప్పుకుంటూ ఉండిపోయాం. హఠాత్తుగా ఆయన నా పేరు పిలిచినట్లయింది. నేను లేచి నిలబడ్డాను. "నీవే స్వయంగా రాశావా?" ఆయన అడిగాడు. పత్రికలో నా రచన అచ్చయినట్లు అప్పటికి నాకు తెలియదు. దాన్ని గురించి కేవలం ఊహించి నేనన్నాను, "అవునుసార్!" "నీవు గెటేను చదివావా?" ఆయన మళ్ళీ అడిగాడు. చదవడం - గిదవడం అటుంచి, నేనప్పటికి ఏ గెటే పేరూ విని ఉండలేదు. నా రచన పైన గెటే ప్రభావం ఉందని ఆయన అన్నాడు. ఆయన మాట నాకు ఏమీ బోధ పడలేదు.

క్లాసు ముగిసిన తర్వాత స్కూలు గేటు వద్ద నాకంటే పెద్ద తరగతుల్లో చదువుకునే విద్యార్థులు నా కోసం ఎదురు చూస్తూ కనిపించారు. నేను అక్కడికి చేరగానే ఒక్క కుదుపున నన్ను తమ భుజాలపై కెక్కించుకొని "లక్ష్మీబాబు అక్కడున్నారు. నిన్ను పిలుస్తున్నారు" అంటూ ముందుకు సాగిపోయారు. లక్ష్మీబాబు అంటే మా స్కూలు అసిస్టెంట్ హెడ్ మాస్టరు. ఆయనంటే మా కందరికీ యమధర్మరాజును చూసినంత భయమేసేది. నే నాయన దగ్గరకు వెళ్ళగానే ఆయన రెండవ తరగతి విద్యార్థులకు నా రచన చదివి వినిపిస్తూ కనిపించారు. చదవడం పూర్తి అయిన తర్వాత అక్కడ కూడా అందరూ నాతో కొంత సేపు పరాచికాలాడారు. స్కూలు వెలుపల కూడా చాలా రోజుల దాకా దీన్ని గురించిన చర్చే జరుగుతూ వచ్చింది. నన్ను విడిచి వెళ్ళిన భూతం ఇప్పుడు చేతులుకట్టుకొని ఎదుట కూర్చుండి పోయింది. నేనప్పటికి రాసిందంతా గద్యమే. అది చూసి కొద్ది రోజుల తర్వాత నా తోటివాళ్ళు, చుట్టు పక్కల వాళ్ళు -- తాము చేయలేని పని నా ద్వారా చేయించుకునే వారందరూ - పట్టుపట్టి "నీవు రచయితవి అయిపోయావు. ఇప్పుడు నీవు కవివి కావాలి" అన్నారు. ఆ రోజుల్లో పద్య రచన చేయకుండా కవి అనిపించుకోవడం వీలయ్యేది కాదు. రచయితల్లో కవికి ఉన్నత స్థానం ఉండేది. ఆ తర్వాత ఎలాంటి - ఎలాంటి ప్రయత్నాలు చేసి, ఎంత చెమటోడ్చి, ఎన్ని యాతనలు పడి నేను కవిననిపించుకున్నాను, అనేదంతా వేరే కథ. దాని సాధక బాధకాల్లోకి వెళ్ళను. మొత్తానికి నా జీవితం గద్య పద్యాల ఆటుపోట్లలో మునుగుతూ - తేలుతూ గడిచింది. నా పరుగు చివరకు నన్ను ఎంతదాకా తీసుకొచ్చిందో, నాకు తెలియదు. నేను కాలానికి కాపలావాడిని కాను. బుద్ధదేవ బసు మాటల్లో కాలం చేతి కీలు బొమ్మను. నేను దేశకాలాల పడగు - పేకలో ఎగురుతూ, దుముకుతూ, నాట్యం చేస్తూ వచ్చాను.

స్తుతి కావ్యాలు రచించిన కవుల్లో చాలామంది దేవతలంతా వాళ్ళపైన ఆధారపడి ఉన్నారనీ, అందువల్లనే తమ - తమ మహాత్మ్యం గురించి వారితో రాయించుకుంటున్నారనీ భావించేవారు. ఆధారపడి ఉండడమనే మాటను ఎవరేవిధంగా అర్థం చేసుకుంటారో, నాకు తెలియదు. విహ్వలత చెందడం. దీనివల్ల అంతఃప్రకృతి, బాహ్యప్రకృతి, వీటి ద్వైతభావం అంతరించి పోతుంది. ఏ రచనకైనా

ఇదే షరతు. రచన అభిప్రాయం తన సంవేదన ఆధారంగా నిర్ద్వంద్వమైన, స్వచ్ఛందమైన లయతో ఆరంభమై పరిణతికి చేరుకుంటుంది. రచనా దానం ఎవరైనా దాన్ని స్వీకరించినప్పుడే పూర్తి అవుతుంది. 'ఏకాంతంలోని ఒంటరి గాయకుని గానం' లాగా కాక, తనతోపాటు తన కళ్ళతో చూసేవారు, తన చెవులతో వినేవారు, మరొకరు ఉండాలనే కోరిక అక్కడ ఉంటుంది. ఎంత వరకు అలా జరగదో, అంత వరకు ఆ రచన, లేక సృష్టి రాణించదు.

దర్శకుడు, శ్రోత, పాఠకుడు, వీళ్ళు ముగ్గురే ఆ 'మరొకరు.' వీరు లేకుండా ఏ రచనా పూర్తి కాదు, కాజాలదు. ఎందుకంటే రచనలో వీరి భాగస్వామ్యం కూడా ఉంటుంది కనుక. ఈ మాటను ఒప్పుకుంటూ కూడా, నా విపత్తుల్లో నన్ను నేనే పిలుచుకుంటూ ఉండినానని కూడా నేనర్థం చేసుకున్నాను. ఈ జ్ఞానపీఠ్ పురస్కారాన్ని నా పాఠకులతో పంచుకోవాలని నేను మనఃపూర్వకరంగా కోరుకుంటున్నాను. కానీ, ఈ పురస్కారంతో పాటు చేరి ఉన్న పెద్దమొత్తంలో నుంచి రచయితగా గత నా అరవై ఏళ్ళ జీవితంలో నాకు లభించిన పాఠకులందరూ తమ - తమ వాటా ఇవ్వమని నన్నడిగితే మాత్రం నా అదృష్టంలో ఒక చిల్లి గవ్వైనా మిగులుతుందనడం సందిగ్ధమే. అందువల్ల నా పాఠకులు దీన్ని కేవలం ఒక భావంగా స్వీకరించినప్పుడే నేను నా యాత్రలో సురక్షితంగా ఉండి పోగలుగుతాను.

జ్ఞానపీఠ్ ఎన్ని భాషలను పురస్కరించిందో, ఆ భాషలన్నీ మాట్లాడే వాళ్ళు ఈ శ్రామిక వర్గ నగరంలో మీకు దొరుకుతారు. నా ఇల్లు - వాకిలీ పోగొట్టుకున్నా, నేను ఎక్కడైతే స్థానం సంపాదించుకున్నానో, అది ఒక మహాదేశం. దాని గతము, వర్తమానము, అంతా నాదే. మేము మా భాషలో, కుటుంబ వ్యవహారాల్లో లీనమై ఉంటాం. రేవు - రేవుకు పయనించే హిందీ అనే నౌకలో మార్కెట్టు పనులకు పోతూ ఉంటాం. తీర్థస్థానాలకూ వెళ్తూ ఉంటాం. నేనీ నగరమనే అద్దంలో మొత్తం దేశం ముఖం చూసుకుంటాను. ఇక్కడి పదునైన రాళ్ళపైన తల బాదుకొని, ఎవరైతే తమ తరతరాల కృషి ద్వారా కలకత్తాను పెంపొందించారో, వాళ్ళు తల దాచుకునే చోట్లు -- పార్కులు, మైదానాలు, జలాశయాలు -- వీటిని కూరి - కూరి రూపాయలు నింపిన గోనె సంచులు హస్తగతం చేసుకుంటున్నాయి. ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ముందుంచుకొని, ఈ శ్రామిక వర్గ నగరాన్ని ఈ అధోగతి నుండి తప్పించే ప్రయత్నం, మనందరం కలిసి చేద్దాం రండి! మొదట - మొదట కవులు సమాజానికి నాయకులుగా ఉంటూ ఉండేవారు. వాళ్ళు మంత్రం చదివి మేఘాలు వర్షించేట్లు చేసేవారు, భూత ప్రేతాలను పారదోలేవారు. అలాంటిదే ఒక చమత్కారం చేసి హస్త లాఘవంతో మీకొక మాజిక్ చూపిస్తాను. దాని వల్ల అలసిపోయిన మీ మనసుకు కొంత విశ్రాంతి కలుగుతుంది.

ఈ రోజు దేశమంతా అన్ని విపత్తుల నుండి ఉద్ధరించే రానున్న శతాబ్దం వైపు నోరు తెరచుకొని ఎదురుచూస్తు ఉంది. జీవితపు మూడు చరణాలు గడిపి నాలుగో చరణంలో జీవిస్తున్న మా లాంటి వాళ్ళ గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. వాళ్ళు ఇంకా ఎన్నో రాత్రులు కొంకర్లు పోయే చలితో పోరాడుతూ గడపవలసి ఉంది. ఇంద్రజాలం ద్వారా ఈ చలిని మాయం చేసి వారి పెదాలపైన చిరునవ్వు చిందేట్లుగా చేయాలని నా కోరిక.

నేనిప్పుడు రవీంద్రనాథ్ కవిత్వంలోని ఒక పంక్తిని మీకు గుర్తుకు తీసుకు రాదలచుకున్నాను. "అరే, నీ వెవరు? నేటి నుండి నూరు సంవత్సరాల తర్వాత కూడా నా కవిత్వం ఆసక్తితో చదువుతున్నావు?'' ఇప్పుడు కొంచెం గమనించి చూడండి, పదహారు కళల నిండు పూర్ణిమ చంద్రుడు ముఖ్య ద్వారం వద్ద చిరునవ్వు చిందిస్తూ నిలుచున్నాడు, కొత్త బెంగాలీ శతాబ్దానికి స్వాగతం పలుకుతూ! ఇంకా కొంత కాలం పడుతుంది. కొద్దిగా ఎదురు చూడాలి. ఆ తర్వాతనే "ఓ నా చంద్రుడా, నీవు పూర్ణిమనాడు వచ్చావు?'' అని ఆప్యాయతతో పలకరించి అతన్ని ఇంటికి తీసుకెళ్తాం.

కవుల ఇంద్రజాలంలో ప్రజలకు ఇప్పుడు నమ్మకం లేదు. ఇప్పుడు మీకు వారిపైన నమ్మకం కలుగుతుందని ఆశిస్తాను. ఈ భానుమతి ఆట చూపించి నేనిక మీ నుండి సెలవు తీసుకుంటాను.

"తెల్ల కాగితంపైన చిలకరించిన కొద్ది సిరా
విషయంగానీ, ఆశయంగానీ, ఆ ముసలివాడి దగ్గర చెప్పడానికేముందని?
ఇతణ్ణి తోడు తీసుకొనే దేశ దేశాలు తిరగడం జరుగుతూంది.
ఈ జీవితంలో ఆ ముసలివాడు ఎప్పుడూ చేయి చాపలేదు.
ఏది తనంతతానే లభించిందో, తృణం గానీ, పణం గానీ, ఏది ప్రోగైందో,
అశ్రుజలంతో దాన్ని పెంచి, పెంపొందించి సంతోషించాడు.
ఇప్పుడా ముసలివాడికి ఈ జీవితం గురించి భయం ఏమీ లేదు. కేవలం రానున్న కాలం గురించే అతని భయం.
పళ్ళూడి పోయాయి, చూపు మందగించింది.
శరీరం ఇప్పుడు మునుపటి కఠోర దినచర్యను భరించలేదు.
స్వర్గం - నరకం, పాపం - పుణ్యం మాటలు అతణ్ణి బాధించవు.
ఈ జీవితంలో ప్రతిరోజూ అతనికి ఉత్సవం అనిపిస్తుంది.
చూస్తున్న దంతా అతనికి భానుమతి ఆటగానే అనిపిస్తుంది!

మనిషి ముసలివాడైనప్పుడు మామూలుగా వదరడం ఎక్కువే అవుతుంది. ఇంగ్లీషు చదువుకున్న వాళ్ళకు ఒట్టి కుండకు ఢమ - ఢమ లెక్కువనే విషయం తెలియనే తెలుసు. నాకొక బెంగాలీ సామెత గుర్తుకు వస్తూంది. ఢాకేర్ వాద్యి థామలేఈ మిష్టి - 'ఆగాలి వాద్యం, అప్పుడే ఖాద్యం' ఇక మీరందరూ ఆ తీపిని పూర్తి నిశ్చింతతో ఆస్వాదించండి.

**జీవిత విశేషాలు, సాహిత్య పరిచయం:** సుభాష్ ముఖోపాధ్యాయ మొదటి కవితా సంపుటి 'పదాతిక్' 1940లో వెలువడింది. అప్పటికి ఆయన వయసు 21 సంవత్సరాలు. ఈ కవితా సంపుటి చారిత్రక కారణాలవల్ల, కొంత శైలీ సంబంధ కారణాల వల్ల సాహిత్య జగత్తులో గొప్ప సంచలనం సృష్టించింది. చారిత్రక కారణాల వల్ల అని ఎందుకన్నారంటే, ఒక బెంగాలీ కవి రాజకీయ పార్టీ ప్రతినిధిగా ఉంటూ కవితా సృష్టిని వృత్తిగా చేసుకోవడం మొదటి సారిగా జరిగింది కాబట్టి. నిజానికి రాజకీయ ప్రభావోత్పాదకత మూలంగానే ఆయన కవిత్వం ఆదరణ, ప్రచారాలకు నోచుకొంది. పేదలకు, దళితులకు అణచివేత నుండి విముక్తి కలిగించే ఉత్సాహంతో చిన్న వయసులోనే సుభాష్ ముఖోపాధ్యాయ ఓడరేవు కార్మికులను సంఘటిత పరచడంలో కృషి చేశారు. ఈ ఉత్సాహమే యువకుడైన తర్వాత కవితా సృష్టికి ప్రేరణ కలిగించింది. ప్రేమగీతాలకు స్వస్తి చెప్పి నిరుపేద వర్గాలకు ఆదరువుగా నిలిచే గేయ కవితలు సృష్టించారు. "ఇది ప్రేమికుల సరసాలకు బొత్తిగా సమయం కాదు" అనే మాయకోవస్కీ మాటను సందేశంగా గ్రహించి ముఖోపాధ్యాయ "ప్రియురాలా! ఇది పూలతో పరాచికాలాడే కాలం ఏ మాత్రం కాదు" అన్నారు. కవితా సంప్రదాయ సంకెళ్ళ నుండి పూర్తిగా విముక్తి పొందిన 'పదాతిక్'లో ఆయన కన్న కలల్లో, ఉద్దేశ్యంలో నవ్యత, యవ్వనం, జీవితానందం ఉన్నాయి. సుభాష్ ముఖోపాధ్యాయ మార్క్స్ సిద్ధాంతాలు ప్రాతిపదికగా విప్లవం ద్వారా మానవాళికి విముక్తి కలిగించే ఉద్దేశ్యంతో కలం పట్టారు. 1919, ఫిబ్రవరి 12వ తేదీన పశ్చిమ బెంగాల్, నాడియా జిల్లాలోని కృష్ణ నగర్‌లో జన్మించిన ముఖోపాధ్యాయ చిన్న తనంలోనే వామపక్ష సిద్ధాంతాల వైపు ఆకర్షితులయ్యారు. 22 ఏండ్ల వయసులోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. ఆ రోజుల్లో ఆయన

ఫాసిజాన్ని ఎదిరించే కవితలు రాశారు. వీటికి విశేషమైన జనాదరణ లభించింది. నగరాల వెలుపల కార్ఖానాల గేట్లు మొదలుకొని పల్లెటూళ్ళలో రైతుల ఇంటి ముంగిళ్ళ వరకు అన్ని చోట్లా తిరుగుతూ, పార్టీ నుండి లభించే చాలీ చాలని భత్తెంతో కాలం గడుపుతూ ఈ సంచార కవి రైతుల సహయాత్రికుడుగా మారి పోయాడు.

రెండవ కవితా సంపుటి 'అగ్నికోణ్' (1948)లో కవి అశేష జన సముదాయానికి సుఖశాంతులు చేకూరడానికి, విప్లవాగ్ని జ్వాలలకు, అంధకారపు ముసుగును ఛేదించడానికి, రాళ్ళు - రప్పలతో కూడిన భూమిని సస్యశ్యామలంగా చేయడానికి సంబంధించిన కలలు కన్నాడు. 'చిర్‌కుటీ' (కాగితం ముక్క 1950)లో బెంగాల్ కరువుకు సంబంధించిన కొన్ని స్మరణీయ చిత్రాలున్నాయి. ఈ కవితలు ఈయన జైలులో ఉండగా రాశారు. 1951లో జైలులో నుండి విడుదల అయిన తర్వాత ముఖోపాధ్యాయ బజ్‌బజ్‌లో జనపనార కార్మికుల కోసం ఒక పత్రిక ఆరంభించారు. ఈ కాలంలో వెలువడిన వీరి రచనలు - మార్క్స్ సిద్ధాంతాలకు సంబంధించిన 'భూతేర్ బేగార్', రోజెన్‌బర్గ్ ఉత్తరాల అనువాదం. ఊరేగింపు, అగ్ని, డోలు, గుండు మొదలైన పదాలు వీరి కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తాయి. కళాకారుడుగా, వ్యక్తిగా, ముఖోపాధ్యాయను బెంగాలీ సాహిత్యంలో బహుశా అందరికంటే వివాదాస్పదుడైన రచయితగా చెపుతూ ఉంటారు. 1982లో ఈయన పార్టీ రాజకీయాలు వదలేశారు. అయినా కార్మిక సంఘాల సమావేశాల్లో, రాజకీయ ఊరేగింపుల్లో ఆయన గీతాలు, కవితలు ఇప్పుడు కూడా పాడడం, చదవడం జరగుతూ ఉంటుంది. రాజకీయ ఆలోచనా ధోరణి, కవితాత్మక అనుభూతులు, ఈ రెండింటి కలగాపులగంగా ఏర్పడిన ముఖోపాధ్యాయ ఈ రెండింటిని సాకారం చేసి పరస్పర ఆధార - ఆధేయాలుగా మార్చారు. కవిత్వం మనిషికంటే ఉన్నతమైంది కాదని భావించే రచయితల శ్రేణికి ఈయన చెందుతారు. కవిత్వం కేవలం జీవితానుభూతిలో సహాయ పడేదే కాదు, జీవితాన్ని నిర్మించడంలో కూడా ఒక సాధనమని, కవిత్వం విలువైనదే అయినా జీవితం దాని కంటే ఎన్నో రెట్లు విలువైందని, ఆయన నమ్మారు.

సుభాష్ ముఖోపాధ్యాయ 16 కవితా సంపుటాలు, 4 నవలలు, 3 యాత్రా వృత్తాంతాలు, 7 అనువాద రచనలు, 5 బాలసాహిత్యానికి సంబంధించిన రచనలు, మొత్తం 50 కి మించి రచనలు చేశారు. Progressive Writer's Union వ్యవస్థాపకుడుగా, Afro - Asian Writer's Association కు Deputy Secretary General గా సేవలందించిన ముఖోపాధ్యాయ తన రాజకీయ కార్యకలాపాల కారణంగా రెండుసార్లు కారాగార శిక్ష అనుభవించారు. ఆయన U.S.S.R. లో, తూర్పు యూరప్‌లోని ప్రజా గణ రాజ్యాల్లో, వియత్నామ్, ఇంగ్లాండు, జర్మనీ, జపాన్, ఈజిప్టు, లెబనన్, ఫ్రాన్సు, తదితర దేశాల్లో పర్యటించారు కూడా. 1969లో సాహిత్య అకాడెమీ పురస్కారం, 1977లో Afro-Asian Lotus Prize, 1982లో కుమారన్ ఆశాన్ పురస్కారం, 1982లో Mizo Tursun Zade Prize (U.S.S.R.), 1984లో ఆనంద పురస్కారం, 1987లో కబీరు పురస్కారం, 1991లో Soviet Land Nehru Prize, జ్ఞానపీఠ్ పురస్కారం, ముఖోపాధ్యాయ పొందారు. శాంతినికేతన్‌లోని విశ్వభారతి విశ్వవిద్యాలయం తన సర్వోచ్చ సన్మానం 'దేసికోత్తమ' ఉపాధినిచ్చి సత్కరించింది. 1971-85 మధ్య కాలంలో బెంగాలీ భాషలో రచించిన సృజనాత్మక సాహిత్యం ద్వారా భారతీయ సాహిత్య సంపదకు అపారసేవ లందించినందుకు ముఖోపాధ్యాయ 1991 వ సంవత్సరపు జ్ఞానపీఠ పురస్కారం పొందారు. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం ఆయన ఉంటున్న కలకత్తాలో జరిగింది. 8 జూలై 2003న వీరు స్వర్గస్థులయ్యారు.

# కాలాన్ని ఎంత నిక్కచ్చిగా కొలవగలం?

- డా॥ చాగంటి కృష్ణకుమారి

పొద్దునే లేచి రేడియో పెట్టాను "శ్రోతలకి నమస్కారం. శక సంవత్సరం 1929. చైత్ర మాసం 20వ రోజు. 2007 సంవత్సరం ఏప్రిల్ 10వ రోజు. నిలయంలో సమయం 5 గంటల 51 నిముషములు దాటి నలభై సెకన్లు అయింది. శుభోదయం."

గోడ గడియారం వైపు చూశాను. అది 5 గంటల 45 నిముషాలు చూపెడుతోంది. దాని సెకన్ల ముల్లు మూడు మీద ఉంది. ఆకాశవాణి సమయంతో దానిని సరిచేశాను. నా చేతి గడియారం ఆకాశవాణి చెప్పినట్టుగానే తిరుగుతోంది.

గడియారాలు చూపించే సమయాలలో ఎందుకీ తేడాలు? మన సమయ పాలన 'కాస్త' అటో ఇటో అవుతూ ఉంటుంది. "కాస్త" అంటే ఎంత? సామాన్యులమైన మన సంగతి సరే; శాస్త్ర పరిశోధనలో అత్యాధునిక వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో పని చేస్తున్న వారు ఏ "కాస్త" తేడా వరకూ సరిపెట్టుకోగలుగుతారు? అసలు మన గడియారాలు చూపెడుతున్న సమయం సరియైన దేనా? ఏ గడియారం కచ్చితమైన సమయాన్ని నిక్కచ్చిగా ఎల్లపుడూ చూపెడుతూ ఉంటుంది? అటువంటి గడియారం ఒకటి ఉంటే కదా, దాని ప్రకారం మిగిలిన మన గడియారాలను సరిదిద్దుకోగలుగుతాము! ప్రామాణికమైన గడియారం ఏది? ఎక్కడ ఉంది? ఎలా పని చేస్తుంది? ఎంత కచ్చితంగా కాలాన్ని కొలవ గలుగుతుంది?

అసలు 'కాలం' అంటే ఏమిటి? సమాధానం చెప్పటం కష్టం. ఏదైనా ఒక రాశిని నిర్వచించాలంటే అంతకంటే ఎక్కువ మౌలికమైన మరొక రాశిపరంగా నిర్వచించాల్సి ఉంటుంది. కాలం కంటే మౌలికమైన రాశి మరొకటి లేదు. అందువల్ల దానిని నిర్వచించడం సాధ్యం కాని పని. అయితే కాలాన్ని కొలవవచ్చు. ఆ కొలతను నిర్వచించవచ్చు.

భవిష్యత్తు నుండి వర్తమానంలోకి ప్రవేశిస్తూ గతంలోకి జారుకొనే కాలాన్ని కొలవడం ఎలా? కాలం కొలతకు మన ముందు ఒక క్రియా సంవిధానం ఉండాలి. అది క్రమం తప్పకుండా స్థిరంగా ఉంటూ పునరావృతి కావాలి. అప్పుడు మనం దానిని సమాన భాగాలుగా విభజించుకొని, కాలగమనాన్ని ఆ భాగాలతో అన్వయిస్తూ కాలగణనను చేయవచ్చు. పొద్దు పొడిచే వేళ తూర్పున కనిపించే సూర్యుడు మన నెత్తి మీద నుంచీ వెళుతూ పడమటి పొద్దు గుంకే వేళకు మాయమవుతాడు. ఈ క్రియా సంవిధానం క్రమం తప్పకుండా పునరావృత్తం కావడాన్ని చాలా సులువుగా మనిషి గ్రహించాడు. ఆకాశంలో సూర్యుని స్థానాన్ని బట్టి పని చేసే గడియారాలు 16వ శతాబ్దంలో ఇండియా, ఈజిప్టు, చైనా, బాబిలోనియా దేశాలలో ఉండేవి. ఆ తరువాత నీటి గడియారాలు, ఇసుక గడియారాలు వాడుకలోకి వచ్చాయి. ఇవన్నీ సమయాన్ని సుమారుగా తెలపగలిగేవే కానీ ప్రామాణికాలు కావు.

కచ్చితమైన గడియారం తయారీకి అనువైన పరికల్పనను అందించిన ఘనత గెలీలియోకి చెందుతుంది. తన జీవితపు చివరి అంకాలలో ఆయనకి చర్చితో చాలా తీవ్రమైన విభేదాలు, తగవులు

---

డా॥ చాగంటి కృష్ణకుమారి, ఎమ్.యస్.సి., పిహెచ్.డి., హిమాయత్‌నగర్, హైదరాబాదు.

ఉన్నప్పటికీ, ప్రారంభ దశలో ఆయన క్రమం తప్పకుండా, ప్రతి ఆదివారం పీసా కెథడ్రల్‌కి వెళ్తూ ఉండేవాడు. అది 1583వ సంవత్సరంలో ఒక ఆదివారం చర్చిలో మత ప్రవక్త ప్రసంగం గెలీలియోకి రుచించలేదు. చిరాకు పుట్టిస్తోంది. అందువల్ల ఆయన చర్చిపై కప్పును చూస్తూ తన ఆలోచనలలో తానున్నాడు. కప్పుకి తగిలించి ఉంచిన దీపం గాలికి ఇటూ అటూ ఊగిసలాడుతోంది. గాలి వీచడంలోని తేడాల వల్ల ఊపు పెద్దది అయినా, చిన్నది అయినా డోలనానికి ఒకే సమయం పడుతోందని గ్రహించాడు. ఆయన తన నాడి కొట్టుకొనడాన్ని లెక్క పెడుతూ దీపం ఊపుకి పట్టిన కాలానికి దానిని అన్వయిస్తూ ఈ విషయాన్ని నిర్ధారించుకున్నాడు. గడియారపు రూపకల్పనకి ఈ ఊగిసలాటలు (డోలనాలు) పనికి వస్తాయని అనుకొన్నాడు. లోలకాలతో అనేక ప్రయోగాలు చేసాడు. లోలక డోలనాల ప్రాతిపదికగా చేసుకొని ఓ గడియారపు నమూనాకి రూపకల్పన చేశాడు.

1656లో క్రిష్టియన్ హైగెన్స్ అనే శాస్త్రజ్ఞుడు గెలీలియో సూత్రాన్నే వాడుకొంటూ లోలక గడియారాన్ని తయారు చేశాడు. ఈ గడియారం రోజుకి ఒక నిముషం తేడాతో నడిచేది. ప్రపంచంలో కెల్లా ఈ మాత్రపు కచ్ఛితత్వాన్ని చూపగల మొట్టమొదటి గడియారం ఇదే. ఆ తరువాత ఆయన దానిని రోజుకి 10 సెకనుల తేడాతో నడిచేటట్టుగా మెరుగు పరచాడు. 1675 నాటికి చక్రాలు, స్ప్రింగ్‌లు కలిగిన కూర్పుతో గడియారాలు తయారు చేసాడు. ఇటువంటి కూర్పుని ఇప్పటికీ మనం వాడుకొనే చేతి గడియారాలలో ఉపయోగించుకొంటూనే ఉన్నాము.

ఉష్ణోగ్రతలలో వచ్చే తేడాల వల్ల లోలక గడియారాల పని తీరు దెబ్బతింటుంది. ఆ తేడాలను తట్టుకొనేలా వాటి తయారీలో కొన్ని మార్పులు చేసి 1721లో జార్జి గ్రహమ్ వాటి కచ్ఛితత్వాన్ని రోజుకి ఒక సెకను దాకా పెంచాడు. గ్రహమ్ విధానాలను మెరుగు పరచడమేకాక, రాపిడిని తట్టుకొనేందుకు కూడా వీలు కల్పిస్తూ జాన్ హారిజాన్ ఈ గడియారాల తయారీని అభివృద్ధి చేసాడు. 1761 నాటికి ఈయన రూపొందించిన మెరైన్ క్రోనో మీటరు సముద్రయానంలో ఓడలపై రోజుకి సెకనులో 1/5 వంతు కచ్ఛితత్వంతో కాలగణన చేసింది. ఆ తరువాత సిగ్మండ్ రీఫ్లర్ 1889లో తయారు చేసిన గడియారంలో రోజుకి సెకనులో 1/100 వంతు కచ్ఛితత్వాన్ని సాధించగలిగారు. ఖగోళ పరిశీలనకు ఇదే ప్రామాణిక గడియారం అయింది. మరో తొమ్మిది సంవత్సరాలు గడిచే సరికి R.J. Rudd స్వేచ్ఛా లోలక సూత్రాన్ని వాడుకొంటూ రూపొందిన ఫ్రీ పెండ్యులమ్ క్లాక్స్ వాడుకలోకి వచ్చాయి. వీటిలో W.H. Shortt గడియారం రీఫ్లెర్ గడియార స్థానాన్ని చేజిక్కించుకొంటూ అనతి కాలంలోనే అనేక పరిశీలనా కేంద్రాలలో అత్యంత ప్రముఖమైన గడియారంగా ప్రసిద్ధి కెక్కింది.

20వ శతాబ్ది ప్రారంభంలో - క్వార్ట్జ్ స్ఫటికానికున్న పీడన విద్యుత్ ధర్మాన్ని (piezo electric property) వాడుకొంటూ రూపొందిన క్వార్ట్జ్ క్రిష్టల్ గడియారాలు అందుబాటులోకి వచ్చాయి. క్వార్ట్జ్ స్ఫటికానికి పీడన విద్యుత్‌లను అనువర్తితం చేసినప్పుడు అది స్థిరమైన పౌనఃపున్యంతో కంపిస్తూ ఉంటుంది. నిలకడగానూ ఒకే వేగంతోనూ ఉండే ఈ కంపనాలు గడియారం ముల్లులను కొంచెం కూడా తేడా రాకుండా కదిలిస్తాయి. అందువల్ల ఈ గడియారాలు నిక్కచ్చిగా కాలాన్ని చూపుతాయి.

1920 నుండి మూడు దశాబ్దాల పాటు ఈ గడియారాలు చాలా నిక్కచ్చి గడియారాలుగా చలామణి అయ్యాయి.

లోలక గడియారాలు ఉష్ణోగ్రతా తేడాలకు ప్రభావితాలు అయితే, క్వార్ట్జ్ క్రిష్టల్ గడియారాలపై తేమ ప్రభావం ఉంటుంది. అందువల్ల మరొక ప్రామాణికమైన గడియారంతో వీటిని సరిదిద్దుకొంటూ ఉండాలి. అందువల్ల శాస్త్రజ్ఞులు పరిసరాల వల్ల ప్రభావితంకాని, ఎప్పుడైనా ఎక్కడైనా ఒకే విధంగా నిలకడగానూ క్రమం తప్పకుండానూ పునరావృత్తం అయే ప్రక్రియ కోసం వెతుకుతూనే ఉన్నారు. ఆ వెతుకులాటే పరమాణు గడియారాల తయారీకి దారి తీసింది.

మూలక పరమాణువులు, రసాయన సమ్మేళనాల అణువులలోని పరమాణువులు క్రమం తప్పకుండా నేనో సెకనుల వ్యవధిలో కంపిస్తూ ఉంటాయి. ఒక నేనో సెకను అంటే సెకనులో బిలియన్ల వంతు. అంటే ఒక సెకను కాల గమనానికి బిలియన్ నేనో సెకనులు పడుతుంది. అందువల్ల పరమాణువులు శక్తివంతమైన లోలకాలుగా ఉపయోగ పడతాయని శాస్త్రజ్ఞులు గ్రహించారు. 1949లో US లోని National Bureau of Standards (NBS) లో మొట్టమొదటి పరమాణు గడియారం తయారయింది. అమోనియా అణువులోని హైడ్రోజన్ పరమాణువు ముందుకీ వెనక్కీ కంపించే వేగంపై ఆధారపడి ఇది పని చేస్తుంది. ఇది ఉష్ణోగ్రత, పీడనము, ఇతర బాహ్యా పరిస్థితుల ప్రభావానికి లోను కాకుండా నిలకడగా కంపిస్తూ ఉంటుంది. ఈ సూత్రంపై ఆధారపడి రూపొందించిన అమోనియా గడియారాన్ని ఇతర ఎలక్ట్రానిక్ లోలక గడియారాలను ప్రామాణీకరించు కోవడానికి వాడుకోవచ్చు. అయితే శాస్త్రజ్ఞులు ఆశించిన మేరకు దీని ప్రామాణీకత లేకపోవటంతో వారు దీనితో తృప్తి పడలేదు.

అమోనియా గడియారం కంటే ఎక్కువ నిక్కచ్చిగా కాలాన్ని కొలవగలిగే గడియారం సీసియం పరమాణువు గడియారం. మాసర్‌లను (Microwave Amplification by Stimulated Emission Radiation) సీసీయం-133 పరమాణువును సోకే టట్టుగా చేస్తే సీసియం పరమాణువు బాహ్యా కర్పరంలోని ఎలక్ట్రాన్ సూక్ష్మ తరంగ ఫోటాన్‌ను (microwave photan) శోషించుకొని కింది శక్తి స్థాయి నుండి పై శక్తి స్థాయికి గెంతుతుంది. ఫోటాన్‌ను ఉద్గారం చెందించినప్పుడు అది పై శక్తి స్థాయి నుండి కింది స్థాయికి దుముకుతుంది. ఈ విధమైన సూక్ష్మ తరంగ ఫోటాన్‌ల శోషణ, ఉద్గారాలు ఒక నిర్దిష్ట పౌనఃపున్యం దగ్గర జరుగుతాయి. ఈ నిర్దిష్ట పౌనఃపున్యం విలువ 9 192 631 770 Hz (సైకిల్స్ పర్ సెకను) సీసియం పరమాణువులలో జరిగే ఈ హైపర్ ఫైన్ మైక్రోవేవ్ ట్రాన్సిషన్‌లను (అతి సున్నితమైన సూక్ష్మ తరంగ పరివర్తనాలు) లెక్కించడం ద్వారా అది వరకెన్నడూ ఎరగనంత కచ్చితత్వంతో పని చేసే గడియారాన్ని రూపొందించ వచ్చు. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకొంటు 1955లో Louis Essen, U.K. లో నున్న National Physical Laboratories లో సీసియం-133 పరమాణు గడియారాన్ని తయారు చేశారు. ఇదే మొట్టమొదటి కచ్చితమైన పరమాణు గడియారం. 1967లో జరిగిన 13వ General Conference on Weights and Measures లో ఈ సీసియం-133 పరమాణు గడియారాన్నే ప్రాతిపదికగా తీసుకొంటూ 'సెకను' అనే కాలం కొలతకు సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. అంతదాకా అంటే 1967 దాకా సెకనును భూభ్రమణాన్ని ఆధారంగా

చేసుకుని నిర్వచించి కొనే వారము. ఒక ట్రాపికల్ సంవత్సరం కాలంలో సూర్యుని చుట్టు భూమి తిరగడానికి 365.24219 రోజులు పడుతుంది. ఈ కాలాన్ని 31,556 9259747 భాగాలుగా విభజించుకొని అందులో ఒక భాగం ఒక సెకనుకు సమానం అని చెప్పుకొనేవారము. కానీ పరమాణు గడియారం చాలా కచ్చితమైన కాలం కొలతను ఇస్తుంది. అందువల్లే శాస్త్రజ్ఞులు సెకనును పునః నిర్వచించారు. సీసియం-133 పరమాణువులో 9 192 631 770 సార్లు అతి సున్నిత సూక్ష్మతరంగ పరివర్తనాలు జరగడానికి పట్టిన కాలం ఒక సెకనుకు సమానం.

కానీ భూ భ్రమణ వేగం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అందువల్లే మనకి కొన్ని సంవత్సరాలు పొడుగుగానూ, కొన్ని పొట్టివిగానూ వస్తాయి. పారిస్‌లోని International Earth Rotation Service వారు అవసరమైన దిద్దుబాట్లు చేసి రెండు విధాలుగా (Earth time and atomic time) ఏక కాల గణన అయ్యేలా చేస్తూ ఉంటారు.

1900 సంవత్సరంలో Jhon Masefield కవిగారు తను రాసిన 'Sea Fever' అనే కవితలో-

*"I must go down to the seas again, to the longly sea and the sky,*
*And all I ask is a tall ship and a star to steer her by"* అని అన్నారు.

ఈ కవి భావాన్ని మనం తెలుగులో ఇలా చెప్పుకోవచ్చు:

"వినీలాకాశపు ఒంటరి వీథులను వీక్షిస్తూ
కడలి ఏకాంతంలో మరోసారి నే పోవాలి
సముద్ర యానానికి.
ఏం కావాలి నాకు!
ఒకే ఒక్క ఓడ, దిశా నిర్దేశానికి ఒక్క నక్షత్రం."

కానీ ఈ కవి సముద్రయానానికి కావలసిన అతిముఖ్యమైన వస్తువునే మర్చిపోయారు. కవిగా ఆయన తన ఊహలలోఎంత దూరాలకైనా ప్రయాణించగల రేమో కానీ వాస్తవంగా కడలి ఏకాంతంలో సుదూర ప్రయాణానికి ఒక "మంచి గడియారం" నిక్కచ్చిగా సమయాన్ని తెలపగలిగేది కూడా తీసికెళ్ళడం తప్పనిసరి. నావికులు నౌకని సరియైన మార్గంలో నడిపించడానికి ఆకాశంలో నక్షత్రం వంక ఏ సమయంలో చూస్తున్నారన్నది చాలా కీలకమైన, ముఖ్యమైన సంగతి. సమయం తెలీనప్పుడు వారు వాడే సముద్ర గోళ పటాలు (Charts) సూచికలు (Tables) అర్థరహితాలే కదా! అయినా ఇదెప్పటి మాట! 20వ శతాబ్ది మొదలు లోనిది! ఆ తరువాత కొద్ది దశాబ్దాలు గడిచే సరికే ఆనాటి సముద్ర గడియారాల (Chronometers) స్థానాన్ని పరమాణు గడియారాలు చేజిక్కించుకొన్నాయి. ఈ రెండు రకాల గడియారాలకీ హస్తిమశకాంతపు వ్యత్యాసం ఉంది. సీసియం - 133 పరమాణు గడియారం పరమాణు అనునాద పౌనఃపున్యాన్ని $10^{14}$ లో రెండు నుంచి మూడొంతులు కచ్చితంగా లెక్కకట్టుతుంది. మరోలా చెప్పాలంటే దీని కచ్చితత్వం రోజుకి రెండు నేనో సెకనులు. అంటే పదునాలుగు లక్షల సంవత్సరాలలో దాని నడకలో తేడా ఒక సెకను వస్తుంది.

21వ శతాబ్దిలో వైమానికులూ, నావికులు పరమాణు గడియారాలు చెప్పే సమయాన్నే అనుసరిస్తున్నారు. ఈ శతాబ్ది శాస్త్రజ్ఞులు ఈ గడియారాలు పని తనాన్ని కచ్చితత్వాన్నీ అంతకంతకూ మెరుగు పరచే దిశగా కృషి చేస్తున్నారు. ఇటువంటి కృషి ఈ ఆధునిక యుగానికి తప్పని సరి.

ఒకానొక నిర్దిష్టకాల వ్యవధిలో ఎన్ని ఎక్కువ సార్లు "టిక్‌టిక్" లని మనం లెక్కించగలిగితే అంత ఎక్కువ కచ్చితంగా కాలాన్ని కొలవ గలుగుతాము. సీసియం-133 పరమాణు గడియారంలో పరమాణువులో జరిగే అతి సున్నిత సూక్ష్మ తరంగ పరివర్తనాలను (hipa fine microwave transitions) లెక్కించి వాటిని ప్రామాణికంగా తీసికోవడం జరిగింది. సూక్ష్మ తరంగ పరివర్తనాల పౌనఃపున్యం కంటే దృశాతరంగ పరివర్తనాల పౌనఃపున్యం ఎక్కువ. అందువల్ల సూక్ష్మతరంగాల కంటే దృశా తరంగాలను (light waves) వాడు కొన్నట్లయితే పరమాణు గడియారంలో నిర్ణీత కాలవ్యవధిలో ఎక్కువ సార్లు 'టిక్‌టిక్' లను లెక్కించడానికి అవకాశం ఉంటుందని శాస్త్రజ్ఞులు గ్రహించారు. సహజంగానే దృశ్య కాంతికి ఉన్న అధిక పౌనఃపున్యాలకి తోడుగా అత్యంత స్థిరమైన లేసర్ల ( Light amplification by shimulated emission radiation) ను వాడి నట్లయితే ఎక్కువ నిలకడగల పరమాణు పౌనఃపున్యాలను పొందవచ్చు. పరమాణువులోని కాంతీయ పౌనఃపున్యాలను (optical frequencies) కచ్చితంగా లెక్క కట్టగలగడానికి 2000 లో Self-referenced femto second frequency comb అందుబాటులోకి రావడంతోనే ప్రపంచ వ్యాప్తంగా దృశాగడియార వ్యవస్థలు (optical clock systems) అభివృద్ధి చెందాయి. దృశా పౌనఃపున్యం ప్రామాణికాలుగా $Al^+$, $Hg^+$ వంటి ఏక విద్యుదావేశ ఏక పరమాణు అయాన్‌లను లేదా Sr, Yb వంటి తటస్థ పరమాణువులను వాడుకొంటూ దృశా గడియారాలు రూపుదిద్దుకో నారంభించాయి. 2001 నుండి జర్మనీ, ఫ్రాన్సు, అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాలకు చెందిన అంతర్జాతీయ భౌతిక శాస్త్ర శిష్టులంతా దృశా పౌనః పున్యాలను లెక్కిస్తూ పని చేసే పరమాణు గడియారాల రూపకల్పనకి పోటీలు పడుతున్నారు. 2001 జూలై మాసంలో National Institute of Stanadards and Technology (NIST) కి చెందిన US శాస్త్రజ్ఞులు తయారు చేసిన పరమాణు గడియారం నమూనాను ప్రకటించారు. అందులో ఏక ధన విద్యుదావేశం గల మెర్క్యూరీ అయాన్ ($Hg^+$) (మెర్క్యూరీ పరమణువు నుండి ఒక ఎలక్ట్రాన్‌ను తొలగించగా ఏర్పడిన అయాన్)ను వాడారు. అది ఒక సెకెన్ కాలంలో మిలియన్, బిలియన్‌ల కంటే ఎక్కువ సార్లు "టిక్‌టిక్" కొట్టుకొంది. అనగా సెకెనులో $10^{15}$ కంటే ఎక్కువ సార్లు కొట్టుకుంది. 2004 నవంబరు మాసంలో బ్రిటిష్‌కి చెందిన National Physical Laboratories - (NPL) శాస్త్రజ్ఞులు స్ట్రానియమ్ అయాన్‌ను వాడుతూ తాము రూపొందించిన గడియారం అది వరకటి వాటికంటే మూడింతలు ఎక్కువ కచ్చితమైనదని ప్రకటించారు.

1990 దశకంలోనే కొన్ని శాస్త్రజ్ఞుల బృందాలు లేసర్లతో పరమాణువులను దాదాపు -273°C దాకా చల్లార్చవచ్చునని కనుగొన్నారు. ఇటువంటి శీతల పరమాణువులు తిరుగులేని, సమర్థవంతమైన లోలకాలుగా పరమాణు గడియారాలకు పనికి వస్తాయి. ఎందుకంటే అంత తక్కువ ఉష్ణోగ్రతల

దగ్గర పౌనఃపున్యాలను మరింత కచ్చితత్వంలో లెక్కించడానికి వీలు కలుగుతుంది. శీతల పరమాణువులపై రెండవ విడతగా మరి ఒక లేసర్‌ను ప్రసరింప చేసి పరమాణువులోని కాంతి పౌనః పున్యాలను లెక్కించే పరమాణు గడియారాన్ని రూపొందించారు. ఇటువంటి గడియారాలను అటామిక్ ఫౌన్‌టెన్‌లు అంటారు.

NPL కి చెందిన ప్రొ. గిల్ (Prof. Gill) బృందం స్ట్రాన్షియమ్ అయాన్‌ను 422nm తరంగ దైర్ఘ్యంగల నీలి లేసర్ కిరణంలో దాదాపుగా - 273°c వరకూ శీతలీకరించి ఆ తరువాత 674nm తరంగ దైర్ఘ్యం గల ఎరుపు లేసర్‌ను దానిపై ప్రసరింప చేయడం ద్వారా లభించే కాంతి పౌనఃపున్యాలను లెక్కపెట్టే గడియారాన్ని తయారు చేసారు. ప్రపంచంలో కెల్లా సర్వోత్తమమైన గడియారం ఇదేనని చెప్పవచ్చు. ఇది సెకెనుని $10^{18}$ లో ఒక వంతు అనగా పదివేల కోట్ల కోట్లలో ఒక వంతు వరకూ కచ్చితంగా కాలాన్ని కొలుస్తుంది. దీనిని ప్రస్తుతం సెకెనులను నిర్వచించడానికి వాడుకలో నున్న సీసియం ఫౌన్‌టెన్ క్లాక్‌తో సరిపోల్చి చూస్తారు. అయితే మనకు సరియైన సమయాన్ని సీసియం-క్లాక్ చెపుతోంది కదా, మళ్లీ ఎందుకీ గడియారాలు అని అనిపించవచ్చు. కానీ ఒక 'సెకెను' కాలవ్యవధిలో ఎన్ని ఎక్కువ 'టిక్‌టిక్'లను లెక్కపెట్ట గలిగితే అంత కచ్చితత్వాన్ని సాధించవచ్చును కనక శాస్త్రజ్ఞులు ఈ శ్రమ అంతా పడుతున్నారు - అందుకు తగిన కారణం లేకపోలేదు.''

'సెకెను' అనే కాలం కొలతను ఎలా నిర్వచిస్తున్నాము? - అనే విషయంపై ఈనాటి గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్‌లు, ఇంటర్‌నెట్‌లో సమాచారాల కదలికలు ఆధారపడి ఉంటాయి. దూరదర్శన్ ప్రసారాలు, ఇ.మేల్ (e-mail) తో చేసే అనేక కార్యకలాపాలు, పవర్ గ్రిడ్‌ల క్రమబద్ధీకరణ, బ్యాంక్ ఖాతాలలోని వడ్డీలను లెక్కించడం, వంటి అనేక సాంకేతిక రంగాల పనుల అనుసంధానాన్ని పరమాణు గడియారాల కాలగణన శాసిస్తుంది.

అంతరిక్షంలో వున్న 24 GPS శాటిలైట్‌లలో ఒకొక్క దాని తట్టుపై నాలుగేసి చొప్పున పరమాణు గడియారాలు ఉంటాయి. శాటిలైట్‌లు పంపిన కాల సంజ్ఞలను (time signals) GPS రిసీవర్లు అందుకొని, లెక్కలు కట్టి నేలపై ఒకానొక వస్తువు స్థానాన్ని త్రిమితీయంగా నిర్ధారించి చెపుతాయి. స్థిరంగా ఉన్న ఒక వస్తువు స్థల నిర్దేశాన్ని కొన్ని మిల్లీ మీటర్ల కచ్చితత్వంతో ఇవి తెలపగలుగుతాయి. అదే కదులుతున్న వస్తువులు - ఉదాహరణకి కార్లు, విమానాలు - వంటి వాటి విషయానికి వస్తే ఇవి చేసే లెక్కలు కొన్ని మీటర్ల వరకు సరిగ్గా ఉంటాయి. అందువల్ల కాలాన్ని లెక్కించే వేగాన్ని పెంచడం ద్వారానే, స్థల నిర్దేశాలను మరింత కచ్చితంగా చేయడానికి GPS రిసీవర్లకు సాధ్యమవుతుంది. అంటే 'సెకెను' అనే కాలం కొలతను మరింత కచ్చితంగా నిర్వచించ గలిగిన నాడే ఇది సాధ్యమవుతుంది.

కాంతి ఒక సెకనులో 300 మిలియన్ మీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని మనం ఒక సారి గుర్తు తెచ్చుకొంటే శాటిలైట్ నించి వచ్చే టైమ్ సిగ్నల్‌లో ఎంత సూక్ష్మమైన తేడా వచ్చినా అది భూమిపై జరిగే నావిగేషన్‌లో బాగా గణనీయమైన దోషాలకు కారణం అవుతుంది అని సులభంగా చెప్పగలుగుతాము. అంతేకాదు, అంతరిక్షంలోకి బాగా సుదూర ప్రాంతాలకి - నౌకలను పంపుతూ వాటిని ఒకానొక ప్రత్యేక స్థానం దగ్గర నెమ్మదిగా లాండ్ (land) కావాలని ఆదేశించవూనిన ఈ

నాటి అంతరిక్ష పరిశోధనలకు, బాగా చెప్పుకోదగినంతగా - అత్యంత నిక్కచ్చిగా కాలాన్ని కొలవగలిగిన గడియారాల అవసరం ఉంది, నౌకలో ఉంచిన పరికరాల మధ్య సంబంధాలనూ, వాటి పని తీరునూ అనుసంధానం చేయడంలో కూడా ఈ పరమాణు గడియారాల పాత్ర చాల కీలకమైనది.

పార్క్స్ (PARCS - Primary Atomic Reference Clock in Space) అనే పేరుతో లేసర్ శీతలీకృత పరమాణు గడియారాన్ని International Space Station లో 2008 కల్లా ఉంచడానికి నాసా వారి ఆర్థిక సహాయంతో సన్నాహాలు జరుగుతున్నాయి. ISS లో సూక్ష్మ గురుత్వ వాతావరణం ఉంటుంది. శీతలీకృత పరమాణువులే పరమాణు గడియారాలకి దొడ్డవైనవి అని అనుకొంటే - అవే కాని స్వేచ్ఛగా రాలుతున్న స్థితిలో - అంటే భార రాహిత్యంలో ఉంటే అవి మహా దొడ్డవైనవే అవుతాయి. ఐన్‌స్టీన్ గారి 'సాపేక్ష సిద్ధాంతం' ప్రకారం బలమైన గురుత్వంలో గడియారాలు తాపీగా కొట్టుకొంటే, బలహీనమైన గురుత్వంలో అంతకంటే వేగంగా కొట్టుకొంటాయి. భూ ఉపరితలం మీద కంటే ISS తట్టుపైన గురుత్వం సూక్ష్మం కాబట్టి PARCS ప్రతి 10,000 సంవత్సరాలకీ ఈ భూమిపై కొట్టుకొంటున్న గడియారాలతో పోలిస్తే ఒక అదనపు సెకెనును కూడబెట్టుకొంటుంది. ఇటువంటి సాపేక్షతా ప్రభావాన్ని GPS శాటిలైట్‌ల అనుభవంలో ఇప్పటికే గుర్తించారు. PARCS గడియారం సాపేక్షతా సిద్ధాంతాన్ని మరొక సారి పరీక్షకు పెట్టి దాని నిగ్గు తేల్చేందుకు అవకాశాన్నిస్తుంది.

భార రాహిత్యంలో తేలుతూ పనిచేసే ఈ PARCS గడియారపు కచ్చితత్వం శిఖరాగ్రానికి చేరినది అవుతుందనీ, చాలా నిలకడగా పని చేయడంలో ఈ గడియారం అత్యంత అపూర్వమైనదిగా నిలుస్తుందనీ చెప్పవచ్చు. నేలపైన ఉంచిన ప్రామాణిక గడియారాల కచ్చితత్వాన్ని మించిన కచ్చితత్వం అంతరిక్షంలో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఈ ప్రామాణిక గడియారం చూపగలదు. PARCS తో పాటు SUMO (Super Conducting Microwave Oscillator) అనే పేరు గల మరొక గడియారాన్ని కూడా అంతరిక్షంలోకి పంపుతున్నారు. ఇది PARCS పనితీరును తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి పని చేస్తుంది. ఇవే కాదు, RACE (Rubedium Atomic Clock Expliment) పేరుతో మరో గడియారాన్ని కూడా రూపొందిస్తున్నారు. ఇది సాపేక్షతా ప్రభావాల అధ్యయనాలకు సరిపడినంత కచ్చితంగా కాలాన్ని కొలవ గలదు అని ఆశిస్తున్నారు.

ISS లో ప్రామాణిక గడియారాలను ఉంచడానికి తలపెట్టిన ఈ బృహత్తర కార్యానికి శాస్త్రజ్ఞులు పెట్టుకొన్న లక్ష్యాలలో : 1) గురుత్వాకర్షణ సిద్ధాంతాలను పరీక్షించడం, 2) సూక్ష్మ గురుత్వంలో లేసర్ శీతలీకృత పరమాణువుల ప్రవర్తనలను అధ్యయనం చేయడం, 3) ఈ భూమిపై కాలగణన కచ్చితత్వాన్ని మెరుగు పరచడం ప్రధానమైనవి.

భౌతిక శాస్త్ర స్థిరాంకాలుగా చెప్పుకొంటున్నవి నిజంగా స్థిరాంకాలేనా? లేదా వాటిపై కాలం ప్రభావ ఉంటుందా? ఉంటే అదెలా ఉంటుంది? అనే కుతూహలానికి కూడా ముందు ముందు ఈ గడియారాల వల్ల సమాధానాలు దొరకవచ్చు.

తొందరలోనే ఈ శాస్త్రీయ పరిశోధనా ఫలితాలు 'సెకెను'ని సరికొత్తగా నిర్వచిస్తూ, ఊహించలేని సాంకేతిక అద్భుతాలకు దారి తీస్తాయని చెప్పవచ్చు.

# అమృత మూర్తి - అమృతాషేర్‌గిల్

- కాండ్రేగుల నాగేశ్వరరావు

మొదటి చూపులోనే ఆకర్షించే అందం, దాన్ని మించిన ఆకర్షణ, ప్రతిభ, సృజన, తెలివి తేటలు, ఛలోక్తులు, గాఢమైన అనుభూతుల సంగమంగా 'అందమే ఆనందం, ఆనందమే జీవన మకరందం' అనే జీవన సిద్ధాంతాన్ని నమ్మి పారదర్శకంగా ఒక ప్రత్యేక మూర్తిత్వానికి ప్రతిబింబంగా జీవించిన స్త్రీ అమృతాషేర్‌గిల్. ఆమె చిత్రాలు చూసినపుడు, ఆమె జీవితం గురించి మనం తెలుసుకున్నపుడు అప్రయత్నంగా 'బ్రేవో అమృతా బ్రేవో, యూ ఆర్ గ్రేట్' అని అనకుండా వుండలేము. ఇరవైవ శతాబ్దపు ప్రథమార్థంలో, పాతకాలపు ఫ్యూడల్ భావజాలాలు అప్పుడప్పుడే వైదొలుగుతున్న వేళలో, భారతీయ చిత్రకళ మొఘల్, యూరోపియన్ సంస్కృతుల ప్రభావం నుండి బయటపడి తన ప్రత్యేకతను అన్వేషిస్తున్న రోజులవి. 1930 సం॥ ప్రాంతంలో దేశభక్తిని రంగరించుకుంటూ ఉప్పెనలా వచ్చిన బెంగాలీ శైలి చిత్రాలు అందరినీ ఒకేవిధంగా ఆకర్షించలేకపోయాయి. దానికి ప్రత్యామ్నాయం కొరకు తహతహ లాడుతున్న భారతీయ కళా హృదయానికి సమాధానంగా వచ్చిన నవ్య భారతీయ కళాశైలికి చెందిన ప్రథమ తరగతి చిత్రకారిణిగా ప్రసిద్ధురాలు అమృతాషేర్.

అమృత తాతగారి పేరు సూరత్‌సింగ్, 1849వ సం॥లో జరిగిన రెండవ ఆంగ్లేయ, శిఖ్ఖు యుద్ధంలో శిఖ్ఖుల వైపు పోరాడి, పంజాబు నుండి బహిష్కరించబడ్డాడు. తిరిగి 1857వ సం॥లో వచ్చిన సిపాయిల కలహమప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం తరపున పోరాడినందుకు గాను, ఘోరక్‌పూర్ జిల్లాలోని కొంత భాగం ఇనాంగా పొందటంతో పాటు రాజా అన్న బిరుదుతో సన్మానించబడ్డాడు. అతని రెండవ కుమారుడైన ఉమరావ్ సింగ్ అమృత తండ్రి, అతను పర్షియన్, ఉర్దూ, సంస్కృత భాషలలో పండితుడు. 20 సం॥ వయస్సులోనే పెండ్లి చేసుకుని, నలుగురు బిడ్డలకు తండ్రైన తరువాత భార్య గతించటంతో ఇంగ్లండ్ చేరుకున్నాడు. అక్కడ మేరీ ఎంటియొనేట్ అనే హంగేరియన్ యూదు స్త్రీతో స్నేహం కలసింది. ఆమె సంగీతంలో దిట్ట, పియానో వాయించటంలో ప్రావీణ్యం కలది. వీరిద్దరి స్నేహం ప్రేమగా మారి 1912 వ సం॥లో శిఖ్ఖు సాంప్రదాయ బద్ధంగా భార్యా భర్తలయ్యారు. వారికి జనవరి 30వ తేదీ, 1913వ సంవత్సరంలో అమృత జన్మించింది. పెద్దకళ్ళు, విశాలమైన నుదురు, నల్లటి జుట్టుతో అందరినీ ఆకర్షించిన ఆ పాపకు శిఖ్ఖుల పవిత్ర స్థలమైన 'అమృత్‌సర్' గుర్తుండేలా 'అమృత' అని నామకరణం చేసాడు తండ్రి. షేర్‌గిల్ అన్నది ఇంటిపేరు. అమృతకు ఎనిమిది సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ ఆ కుటుంబం హంగేరీలోనే నివసించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో యూరోప్‌లో ఉండటానికి ఇబ్బందులు ఏర్పడటంతో షేర్‌గిల్ కుటుంబం భారతదేశం వచ్చి సిమ్లాలో ఇల్లు తీసుకొని అక్కడే నివసించారు.

అమృత తల్లి మేరీ ఎంటియొనేట్ గర్విష్ఠి. అధికార దర్పం, అహంభావం ఆమె సహజ గుణాలు. సిమ్లాలో నివసిస్తున్న బి.కె. నెహ్రూ భార్య షెబీ కూడా హంగేరియన్ యువతే, అయితే ఆమె చీర కట్టుకొని, భారతీయ సంప్రదాయంలోకి ఒదిగి పోతే, మేరీ మాత్రం తన హంగేరియన్ అస్తిత్వాన్ని వదులుకోవడానికి, చివరకంటూ ఇష్టపడలేదు. సిమ్లాలోని ఇల్లంతా హంగేరియన్ రీతిలోనే అలంకరించబడింది. ఆహార పానీయ విషయాలలో కూడా అంతే. తన పిల్లలైన అమృత, ఇందిర (రెండవ కుమార్తె) లకు పాశ్చాత్య క్లాసికల్ సంగీతంలో శిక్షణ ఇచ్చేది. అమృత తండ్రి ఉమరావ్‌సింగ్

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

పూర్తిగా ఆమెకు భిన్నమైన మనస్తత్వం కలవాడు. టాలస్టాయ్ రచన అంటే అమిత ఇష్టం. ఆయన లానే దుస్తులు కుట్టించుకుని, మద్యం, మాంసాలను దరి చేరనిచ్చేవాడు కాదు. అమృతకు తల్లికి ఒక్క క్షణం పడేది కాదు. ఆమె పూర్తిగా తండ్రి పక్షం. ఆమెకు డోస్టోవిస్కీ అభిమాన రచయిత. ఆమెను పియానోలో star performer చేయాలనుకుంది తల్లి. స్వేచ్ఛా తత్వం గల అమృత ఒకసారి తల్లి ఆశలను చిగురింప జేస్తూ, మరొకసారి వాటిని కాలరాస్తూ అర్థం లేని ఒక ప్రహేళికగా పెరగసాగింది. ఇంటా వంటా లేని రంగుల ప్రపంచం ఆమెను ఆకర్షించింది. అది చిన్న తనంలోనే ఒక దృఢ నిర్ణయంగా మారింది. "నేను చిత్రకారిణి నవుతా, నన్నెవ్వరూ ఆపలేరు" అని ప్రకటించింది. ఖాళీగా వుండే ప్రతి కాగితంపై ఆమె పెన్సిల్‌తో బొమ్మలు వేసేది. చివరకు ఇంటి గోడలను కూడా వదలలేదు.

అమృతకు చిత్రకళ నేర్పించటం కోసం సిమ్లాలో నివసిస్తున్న హంగేరియన్ దేశస్థుడైన మేజర్ విట్ మార్ష్ నియమించబడ్డాడు. పూర్తి సాంప్రదాయ బద్ధమైన అతని పాఠాలు ఆమెకు నచ్చలేదు. లండన్‌లో 'స్లేడ్' స్కూలులో పనిచేసి రిటైరైన బివాన్ పిట్‌మాన్‌ను ఆమెకు రెండవ గురువుగా నియమించారు. ఆమెలోని సృజనను గుర్తించిన మొదటి వ్యక్తి అతనే. ఆమెను ఇటలీకి తీసుకొని వెళ్ళి అక్కడ తర్ఫీదు ఇప్పిస్తే బాగుంటుందనే సూచనలిచ్చాడు. మొత్తం కుటుంబం పెట్టే బేడా సర్దుకుని ఇటలీకి ప్రయాణ మయ్యారు. ఒక్క కూతురు చదువు కోసం మొత్తం కుటుంబమే తరలి వెళడం ఆ రోజులలో వింతగా చెప్పుకున్నారు. 1924వ సంవత్సరంలో ఫ్రాన్స్‌లోని సెయింట్ ఎవన్సియేటా స్కూలులో ఆమెను జేర్పించారు. అది రోమన్ కాథలిక్ అధ్వర్యాన నడవటంతో అక్కడి నిబంధనలు ఆమెకు కారాగారంలా తోచేది. ఒక నగ్న స్త్రీ చిత్రాన్ని వేసినందుకుగాను ఆమెను స్కూలు నుంచి బహిష్కరించేటంత పని చేశారు. అక్కడ ఆమె నాలుగు సంవత్సరాలు గడిపింది. అక్కడ నుండి పారిస్ వెళ్ళి అక్కడవున్న 'Eole National des Beaux Arts' అనే చోట చిత్రకళ నేర్చుకుంది. అక్కడ ఆమె వేసిన 'కన్వర్ సేషన్' అన్న చిత్రానికి గాను 1933వ సంవత్సరంలో అసోసియేట్ ఆఫ్ ది గ్రాండ్ సాలూన్‌గా ఆమెను ఎంపిక చేశారు. ఆ రోజులలో పోస్టు ఇంప్రష నిష్టులైన సజాన్, పాల్‌గాగున్, విన్సెంట్ వాన్‌గో చిత్రాలు ఆమెను ప్రభావితం చేశాయి. క్యూబిస్టు చిత్రాలు గాని, నర్మగర్భమైన నైరూప్య చిత్రాలుగాని ఆమెను ఆకర్షించలేకపోయాయి. ఫారిస్ ఆమెలోని స్వేచ్ఛా కాంక్షను మరింత విస్తృత పరచింది. అక్కడ వుండగా ఆమె అనేక స్వీయ చిత్రాలు (మొదటి అట్టపై చిత్రం) వేసుకుంది. ఆ రోజులలో ఆఫ్రికన్ చిత్రాలు ఐరోపా వాసులను అలరించేవి. వాటిలోని వేగము, ప్రాథమిక రేఖా లక్షణం వారి పరిశోధనలకు మూలసరుకై కూర్చుంది. ఏవిషయాన్నయి వీలైనంత సరళంగా కొంత అస్తవ్యస్తంగా రూపం, రేఖలు, రంగూ కూర్పుగా వేయగల ఆమె చిత్రకళ ఒక ప్రత్యేకతను సంతరించుకుంటూ ఎదగసాగింది. ఫారిస్‌లో ఒకసారి ఆమె భారతీయ సంప్రదాయపు చిత్రాలను చూసింది. అవి ఆమెను ఎంతగానో ఆకర్షించాయి.

ఫారిస్‌లో అప్పుడప్పుడే వస్తున్న పేరుకు స్వస్తి చెప్పింది. భారతదేశంపై తీవ్రమైన మమకారం ఏర్పడింది. కూతురు ధోరణిని వారు సహించలేకపోయారు. 1933 నాటికే భారతీయ భావన తీవ్రతరం కాజొచ్చింది. భారతీయ కళ ఆమెను వెంటాడి ఆవహించింది. ఇక క్షణకాలమైనా పారిస్‌లో ఉండలేని అసహనానికి లోనైంది. ఫారిస్‌లో ఉండగా ఆమెకు అనేక ప్రేమ సంబంధాలు ఏర్పడ్డాయి. ఒకసారి గర్భస్రావం కూడా జరిగింది.

భారత దేశం తిరిగి వస్తే ఆనోట ఈనోట ఈ సంగతులు బయటకు పొక్కి తమ కుటుంబ పరువు గంగపాలవుతుందనే భయం పట్టుకుంది తండ్రికి. సనాతనమైన ఆ దేశం తన కూతురును

క్షమించదని భావించాడు. 'లైంగికానందపు స్వేచ్ఛ వ్యక్తిగతమైనది, దానికి సమాజంతో సంబంధం లేదు, భారతదేశానికి తిరిగి వెళ్ళాలని కోరుకోవటం కేవలం నా కళా ఆర్తిని తీర్చుకోవడనికే తప్ప మరెందుకూ కాదు, ఆ దేశంలో తప్ప మరే దేశంలోనూ నా చిత్రకళ పరిపక్వం సాధించలేదు', నేను కోరుకున్న దేదో ఆ దేశంలోనే లభిస్తుంద''ని చెప్పటంతో 1934 వ సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చిందా కుటుంబం.

వచ్చిన కొత్తలో వేసిన కొండ ప్రాంతపు పురుషులు, స్త్రీలు అన్న చిత్రంలో పాశ్చాత్య ప్రభావం కనిపిస్తుంది. 1935లో ఆమె వేసిన ముగ్గురు అమ్మాయిలు అన్న చిత్రం ఆమెకు విశేష పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. ఈ చిత్రంలో సజాన్, మొదిగ్లియాన్, రెనాయిర్ ప్రభావం కనిపిస్తుంది. ఆమె తండ్రికి ఫోటోగ్రఫీ ఇష్టం. ఆ ఫోటోల నుంచి ఆమె ప్రోత్సాహం పొందేది. ఆ రోజులలో నిశ్చల చిత్రాలు తెలుపు నలుపులలోనే వుండేవి. ఆమె చిత్రాలలో తెలుపు నలుపుల ప్రాధాన్యతకు అదేకారణం. ఆమె వేసిన స్వీయ చిత్రం అఖిలభారత లలిత కళా సంస్థలో బహుమతి పొందింది. బాంబేనగరంలో ఆమె వేసిన ముగ్గురమ్మాయిల చిత్రా (రెండవ అట్టపై చిత్రం) నికి బంగారు పతకం లభించింది. పత్రికలు ఆమెతో ముఖాముఖి జరిపాయి. ఏ విషయమైనా ఖరాఖండిగా మట్లాడే అమృత "నేను పారిస్‌లో చిత్రకళ నేర్చుకున్నా దీన్ని ఒక శాస్త్రంలా అభ్యసించలేదు. ఎందుకంటే బయట నుంచి నెట్టబడే ఏ అభిప్రాయాన్నీ నేను స్వీకరించలేను, అది నా స్వభావానికి విరుద్ధం. నేను నా అంతరంగ దృష్టి నుంచే వస్తువును చూస్తున్నాను. దానిని నా భావనా తరంగాలతో ముడివేసి వెలుపలికి తీసుకొని వస్తున్నాను. ఇది నా అంతరంగ ప్రస్థానం. నా శైలి సంప్రదాయం భారతీయ శైలికాక పోవచ్చు. కానీ ఇందులో అణువణువునా భారతీయత నిండివుందని'' చెప్పుకుంది.

1936 వ సంవత్సరం నుంచి 1939 వరకూ ఆమె చిత్రకళ ఔన్నత్య శిఖరాలను తాకిందని భావిస్తారు. 1936 వ సంవత్సరంలో ఆమె అజంతా, ఎల్లోరా గుహలను దర్శించి ఆ కళా వైభవానికి ముగ్ధురాలైంది. ఏ విషయంపై నైనా అతిగా స్పందించే అమృత, అజంతాలోని చిత్రకళ ఇటలీలోని పునర్వికాస దశ చిత్రాలకంటే మెరుగైనవని ప్రకటించింది. అజంతా ప్రభావం ఆమె వేసిన 'బ్రహ్మచారులు' (మూడవ అట్టపై చిత్రం), 'పెండ్లి కూతురు ముస్తాబు' (నాల్గవ అట్టపై చిత్రం) అన్న చిత్రాలలో ప్రగాఢంగా కనిపిస్తుంది. అజంతా నుంచి కేరళ, తమిళ ప్రాంతాలు చుట్టు ముట్టింది. సత్తానాల్ దేవాలయంలోని కుడ్య చిత్రాలు అజంతా కంటే మెరుగైనవిగా ఆమె భావించింది. మధుర, రామేశ్వరం దేవాలయాల్లోని కుడ్య చిత్రాలు ఆమెను ఆకట్టుకున్నాయి. అక్కడకు వచ్చిన భక్తజనం, రంగురంగుల పట్టు చీరలతో దవళ వస్త్రాలలో ఎంతో అందంగా కనిపించారు. పాల్‌గాగున్‌కు తహతీలో ఆయనకు కావలసింది దొరికినట్లుగా, దక్షిణ భారతంలో ఆమెకు కావలసినది లభించింది. నలుపు, గోధుమ రంగుల కలయికగా వున్న మేని ఛాయ, బడుగు భారతీయుని జీవితంలో తొణికిస లాడుతున్న అనంత విషాదాన్ని నిశ్శబ్దంగా భరిస్తున్న మనుష్యుల ముఖ కవళికలను ఆమె తన చిత్రాలలో చూపించే ప్రయత్నం చేసింది. కేరళలోని పద్మనాభ దేవాలయంలోని చిత్రాలు, కొచ్చిన్‌లోని మట్టంచరీ రాజమహల్‌లోని చారిత్రాత్మక సాంప్రదాయ చిత్రాలు ఆమెను విపరీతంగా ఆకర్షించాయి. తెలుపు రంగును భావస్ఫోరకంగా ఉపయోగించటం (అజంతా ద్వారా) తెలుసుకున్నది అక్కడే.

1938లో వ సం॥లో సరయూనదీ తీరంలో వేసిన మరొక కుటుంబ చిత్రం స్త్రీలు. ఇందులో అజంతాలోని పద్మపాణిలా నవ యవ్వన దశలో వున్న యువతి అర్ధనగ్నంగా తన శరీరం చుట్టూ ఒక

పలచటి బట్టను కట్టుకొని అర్ధనిమిలిత నేత్రాలతో చేతిలో ఒక పువ్వును పట్టుకొని వుంటుంది. ఇది కాక నదిలో స్నానం చేస్తున్న ఏనుగులు, ఎర్రటి స్తంభాలతో నున్నటి వరండాలు కలిగిన దక్షిణ ప్రాంతపు ఇల్లు మొదలైనవి ఆమెకు ఇష్టమైన చిత్రాలు.

'దక్షిణ భారత జీవిత విధానంలో పాశ్చాత్యా ప్రభావం అంతగా లేదు. వీరు అదృష్టవంతులని తన దిన చర్యలో వ్రాసుకుంది. దక్షిణ ప్రాంతపు నేత చీరలపై పిచ్చి వ్యామోహాన్ని పెంచుకుంది. భారతదేశంలో కాలిడినప్పటి నుంచీ ఆమె బయటకు ఎప్పుడు వచ్చినా చీరనే ధరించేది. తిరువనంతపురం రాజు రాణీలు ఆమె చిత్రాలను కొనుగోలు చేయాలనుకున్నారు. కానీ అక్కడి సంస్థానంలోని మ్యూజియం క్యూరేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కజిన్స్‌కు ఆమె చిత్రాలపై సదాభిప్రాయం లేదు. అతను నందలాల్ బోస్ చిత్రకళాభిమాని. దానితో ఒక్క చిత్రం కూడా అమ్ముడు పోలేదు.

అక్కడ నుండి హైదరాబాద్ వచ్చిన అమృతకు ఘన స్వాగతం లభించింది. బంజారా హిల్స్‌లోని ఒక భవంతిలో ఆమెకు బస ఏర్పాటు చేయబడింది. ప్రభుత్వ అతిథిగా ఆమెను గౌరవించి సత్కరించారు. ఆమె చిత్ర కళా ప్రదర్శనను ప్రిన్స్ బెరార్ ప్రారంభించారు. భారత కోకిల సరోజినీ నాయుడు ముఖ్య అతిథిగా వచ్చి ఆమెను ప్రశంసించింది. ఒక్క చిత్రం 250 రూపాయలకు అమ్ముడైంది. నవాబ్ సాలర్ జంగ్ ఆమె చిత్రాలలో ముగ్గురు స్త్రీలు అన్న చిత్రం, మరొక నగ్న స్త్రీ చిత్రాన్ని కొనడానికి ఉత్సుకత చూపాడు. తరువాత ఎందుకో అవి ఆధునిక శైలిలో వున్నాయని భావించి, నిరాకరించారు. ఆమె దక్షిణ భారత యాత్రలో వేసుకున్న అనేక చిత్తు ప్రతులను సిమ్లాకు వెళ్ళిన తరువాత కాన్వాస్ చిత్రాలుగా రూపుదిద్దింది.

ఢిల్లీ నగరం దేశానికి ముఖ్య పట్టణమైనా ఆ రోజులలో లాహోరును ఒక సాంస్కృతిక కేంద్రంగా భావించే వారు. ఆమె ప్రదర్శన లాహోరులో జరిగేనాటికి ఆమె ఒక సెలబ్రిటీ, పత్రికలు ఆమెకు బ్రహ్మరథం పట్టాయి.

ఆమె స్వేచ్ఛను ప్రేమించింది, అలానే జీవించింది. లైంగిక స్వేచ్ఛనామె అనుభవించింది. ఆమె ప్రియులలో ముఖ్యులు బ్రిటీష్ జాతీయుడైన స్టేట్స్‌మన్ పత్రిక ఉపసంపాదకుడైన మాగ్‌రిడ్జ్, మరొకరు కొరాల్ ఖండాల్ వాలా ప్రిన్స్ ఆఫ్ వీల్సు మ్యూజియం ఛైర్మన్. ఆమె ప్రణయ జీవితంలో అనేకమంది విహరించి వెళ్ళారు. ఆమె మనస్సును ఆకట్టుకున్నవాడు ఆమె పిన తల్లి కుమారుడు ఐరిష్ దేశస్థుడైన విక్టర్ ఇగాన్ మాత్రమే. ఆమె గురించి ఇంత తెలిసినా ఎంతోమంది ఉన్నత కుటుంబీకులు ఆమెను పెండ్లి చేసుకోవడానికి ఉత్సాహం చూపించారంటే భౌతికంగా మానసికంగా ఆమె గ్లామర్ ఎంత శక్తివంతమో మనం ఊహించుకోవచ్చు.

అమృత కంటే ఒక సంవత్సరం చిన్నదైన అమృత సోదరి ఇందిర, అమృత స్వభావానికి పూర్తి భిన్నమైన వ్యక్తిత్వం కలది. 1937 వ సంవత్సరంలో ఆమె వివాహం కళ్యాణ సుందరం అనే ఒక I.C.S. ఆఫీసరుతో జరిగింది (మొట్ట మొదటి స్వతంత్ర భారతదేశపు ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేసిన వ్యక్తి). అమృతకు ఒక నవాబుతో తల్లి పెండ్లి నిశ్చయం చేసినా అమృత తిరస్కరించింది.

1938వ సంవత్సరంలో ఆమె విక్టర్ ఇగాన్‌ను పెండ్లి చేసుకోవడానికి నిశ్చయించుకుంది. వావి, వరుస లేని ఈ పెండ్లి తల్లికి బొత్తిగా ఇష్టం లేదు. అతను డాక్టరు విద్య నభ్యసించినా తన కూతురుకు ఏ సంస్థానాధీశుడినో, పెండ్లి చేసుకుంటే బాగుంటుందని భావించిన ఆమె అమృత ఎన్నికను

అంగీకరించకపోయింది. అమృత, విక్టర్ ఇగాన్‌ల వివాహం చాలా నిరాడంబరంగా 16 జూలై 1938 వ సంవత్సరంలో హంగేరీలో జరిగింది (విక్టర్ అప్పుడు అక్కడ పని చేస్తున్నాడు). వివాహానికి ముందు భార్యాభర్తలిద్దరూ ఒక అవగాహనకు ఇచ్చారు. అందులో మొదటిది విక్టర్ తనకు స్వయనా పిన్ని కొడుకు కావటంతో వైద్యశాస్త్ర రీత్యా పిల్లలు కలగటం మంచిది కాదని భావించారు దంపతులు. అదీకాక అమృతకు పిల్లలను కనడం ఇష్టం లేదు. జీవిత మంతా ఏకాగ్రతతో చిత్రాలు గీయాలనేది ఆమె జీవన దృక్పథం. రెండవది ఆమె లైంగిక స్వేచ్ఛకు అతను ఏనాడు అడ్డు తగల కూడదు. ఈ రెండు షరుతులపైనా వివాహం జరిగింది. కొన్నాళ్ళు హంగేరీ ముఖ్య పట్టణమైన బుదాపెస్ట్‌లో కాపురమున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభంలో హిట్లర్ యూదు సంతతి నిర్మూలనకు కంకణం కట్టుకోవటంతో భార్యా భర్తలు భారత దేశం తిరిగొచ్చారు. ఇంటి వద్ద ఏ విధమైన ఆదరణ లభించలేదు. దానితో పంజాబు ప్రాంతానికి వెళ్ళి 1941వ సం॥లో అక్కడవున్న బంధువుల ఇంట్లో కొన్నాళ్ళు కాపురమున్నారు. ఉన్నట్లుండి కలరా సోకింది. ఈ విషయం పదిమందికీ తెలిసేలోపునే ఆమె మరణించింది. ఆమె మరణానికి విక్టర్ కారణమని అమృత తల్లి నిందించింది. దేశంలో అనేక మంది నాయకులకు విక్టర్ ఉదాసీన భావంతో తన కూతురును హత్య చేసాడనే ఉత్తరాలు పంపటం దాకా వెళ్ళింది వ్యవహారం. కానీ ఎవరూ నమ్మలేదు. ఆమె లానే ఆమె చావు కూడా ఒక మిస్టరీ. అమృత చెల్లెలైన ఇందిర కుమారుడైన వివాన్ సుందరం అమృతకు పారిస్‌లో సోకిన ఒక సుఖవ్యాధి తిరగ బెట్టటంతో అది కలరా సమయంలో తీవ్రతరమై ప్రాణాలు తీసిందని చెబుతాడు.

ఆమె స్వైర్వణి అని భావించినా, ఆమె జీవితంలో ఒక నిబద్ధత, నిజాయితీ ఉంది. ఆమె ఏ విషయాన్ని దాచుకోవడానికి ప్రయత్నించలేదు. ఆమెను, ఆమె చిత్రకళను అభిమానించిన వారిలో జవహర్‌లాల్ నెహ్రూ కూడా వున్నాడు. ఒకప్పుడు నెహ్రూ ఆమెకు పది పేజీల ఉత్తరం వ్రాసాడు. ఆమె ఇంటిలో ఇటువంటి ఉత్తరాలు ఒక బీరువా నిండుగా వుండేవి. ఆమె విక్టర్‌ను పెండ్లి చేసుకోవడానికి హంగేరీ వెళ్ళినపుడు అమృత తల్లి ఆ బీరువాను తెరచి ఆ ఉత్తరాలన్నిటినీ తగుల బెట్టించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అమృత తల్లిపై అగ్గిమీద గుగ్గిలం అయింది. "ప్రయోజనం లేని మర్యాద ముసుగును నాపై కప్పాలని మా అమ్మ ప్రయత్నం" అంటూ తన డైరీలో వ్రాసుకుంది. ఆమె తన స్వీయ నగ్న చిత్రాల ననేకం వేసుకుంది.

ఆమే వేసిన ఒక చిత్రం క్రిందట సంవత్సరం లండన్‌లో జరిగిన కళా చిత్రాల వేలంపాటలో 12 కోట్ల రూపాయలకు అమ్ముడైంది. ఇంత ఖరీదుకు ఏ భారతీయుని చిత్రాలు ఇంతవరకూ అమ్ముడు పోలేదు.

చలం రచనలలో కనిపించే రాజేశ్వరి, లాలసల స్వభావాన్ని మనం అమృతలో చూడవచ్చు. చలంకు ఆమె గురించి తెలిసినట్లు లేదు. తెలిసివుంటే ఆమెపై ఒక కావ్యమే వ్రాశే వాడేమో.

ఢిల్లీలోని నేషనల్ ఆర్ట్ గ్యాలరీలో ఆమె చిత్రాలకు ప్రత్యేకించి ఒక గది (A.C.ది) కేటాయించారు. ఒక మెరుపులా వచ్చి, క్షణకాలం మెరిసి అంతలోనే అదృశ్యమైన విద్యుల్లతామె. హంగేరీలో ఆమె చిన్నప్పుడు నివసించిన ఇంటిని హంగేరీ ప్రభుత్వం నేషనల్ హెరిటేజ్ సెంటర్‌గా గుర్తించింది. ఆమె తమ దేశపు వారసత్వ చిహ్నమని భావించటంలో రెండు దేశాలూ పోటీ పడుతున్నాయి. అంతకంటే ఆమెకు మరో నివాళి దేనికి?

# కాళోజీ కవిత్వం - వ్యక్తిత్వం

## *(9 సెప్టెంబర్ 1914 కాళోజీ జయంతి, 9-9-07 7వ 'తెలుగు మాండలిక భాషా దినోత్సవం సందర్భంగా)*

- డా॥ మలయశ్రీ

కాళోజీ జనం కవి. నిజం కవి. ఆయన జయంతి 2001 నుంచి 'తెలుగు మాండలిక భాషా దినోత్సవం'గా జరుపబడుతున్నది. పద్మవిభూషణ్ కాళోజీ 50, 60 ఏండ్ల క్రితం మన మాతృభాష తెలుగును అభిమానిస్తు రాసిన గేయం చూడండి.

**'ఏ భాషరా నీది ఏమి భాషయురా / ~~ఈ~~ భాష ~~ఈ~~ వేష మెవరి కోసమురా...**
**అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు / సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా?"**

ఈ ఒక్క గేయం చాలు కాళోజీ తెలుగును ఎంత ప్రేమించే వారో తెల్పటానికి. అప్పుడు ఉర్దూ ఊపు, ఇప్పుడు ఆంగ్ల చూపు అదే బాధ. కాళోజి మాతృభాష మరాఠీ, ఉర్దూ మాధ్యమం చదువు. పుట్టి పెరిగింది తెలంగాణా - హన్మకొండ. ఈ గాలి, నేల, నీరు ఆయనకు ఇక్కడి జనంపై, భాషపై అభిమానం కలిగించినై, పెంచినై, ఆయన ప్రజాకవి, దీన జన పక్షపాతి.

**"ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు**
**అవనిపై జరిగేటి అవకతవకలు జూచి**
**పరుల కష్టము చూసి పగిలి పోవును గుండె**
**మాయమోసము, జూచి మండి పోవును ఒళ్ళు**
**పతిత మానవు జూచి చితికి పోవును మనసు"**

సామాజిక స్పందనలకు ప్రతి స్పందనలు కాళోజీ కవితలు. అవీ లయబద్ధ గేయాలు, తెలుగు భాషకు సహజమైన యతి ప్రాసలు వీరి కవితలకు అలవోకగా అతికిపోయినై, వీరి కవితా నిర్వచనాలు ప్రతిభా సంపన్నాలు.

**"ఒక్క సిరాచుక్క వేయి మెదళ్ళకు కలయిక"**
**"అన్యాయాన్ని అందరమూ కల్సి ఎదిరించాలె"**
**"ఒకళ్ళు ఎక్కువ ఒకళ్ళు తక్కువ అనేమాట పోవాలె"**

ఇవీ ఆ ప్రజాకవి నినాదాలు - విధానాలు. అందుకే ఆయనను 'అభినవ వేమన' అన్నారు, పద్యాలు రాయకున్నా - భావాలు చూసి. కాళోజీ స్వేచ్ఛా జీవి, స్వచ్ఛమైన మనసు, అచ్చమైన కవి. ఆయన ఏ ఉద్యోగమూ చేయలేదు, వకాలత్ చదివినా ప్రాక్టీసు పెట్టలేదు, ఏ వ్యాపార రంగానికీ పోలేదు, బాల్యాన తండ్రి, తర్వాత అన్న రామేశ్వరరావు ఆయన పోషకులు.

కాళోజీ పుస్తకాలు (నాగొడవ, జీవన గీత...) అన్నీ పదిరవైకి మించవు. మిత్రులు అభిమానులే వాటిని ప్రచురించి పంచిన్రు. ఆశలేని మనిషి కాళోజీ. ఆయన స్వార్థం ఎరగరు. సంపాదన తెలియదు. సమాజ హితం కోసం పరితపన, సాహసిక, సంచలన జీవితం ఆయనది. సత్యం సామాజిక న్యాయం కోసం కలం ఖడ్గంతో కవన పోరాటం కావించిన వీర యోధుడు కాళోజీ.

ఆయన గాంధేయ వాదిని అనుకున్నారు - అల్లిన్నరు.

---

డా॥ మలయశ్రీ, భౌతికవాద రచయిత, నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, కరీంనగర్.

అయినా - ఆయన, అన్యాయాన్ని దౌర్జన్యాన్ని గట్టిగా ఎదిరిస్తూ అటువంటి సందర్భాలందు శాంత్యహింసల నిరసించిండు కూడా.

మన దేశానికి 15 ఆగస్టు 1947న, స్వాతంత్ర్యం వచ్చింది. ఈ 2007 సం॥ అర్వై ఏండ్ల పర్వమూ జరిగింది కదా. అయితే అప్పుడు నైజాం - తెలంగాణాలో ముస్లింల పాలనే కొనసాగింది. ఆ నాటి రజాకర్ల దురంతాలు చెప్పరాని ఘోర క్రూర కృత్యాలు. అప్పుడు నైజాం విప ్లక్తి పోరాటంల బందీ కావించబడి, కాళోజీ గుల్బర్గా జైలు నుంచి రాసిన కవిత ఇది (1948) -

"మనకొంపలార్చిన మన స్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచి పోకుండగ గురుతుంచుకోవాలె
కసి ఆరిపోకుండ బుసగొట్టుచుండాలె
కాలంబు రాగానె కాటేసి తీరాలె -
సత్యమ్మహింసయని సంకోచపడరాదు
దయయు సత్యమ్మనుచు తడుముకో పనిలేదు
కాలంబు రాగానె కాటేసి తీరాలె -"

తర్వాతి పంక్తులు ఇంతకు ఘాటుగా ఉన్నయ్ లెండి. రజాకార్లు, నిజాం సిపాయీలు, స్థానిక జమీందార్లు, భూస్వాములు కల్సి బైరాన్‌పల్లి (జనగాం) ప్రజల ఊచకోత కోసిన వార్త తెలిసి, ఆవేశం పొంగి పై కవిత వెలువడ్డది.

"హింస తప్పు, రాజ్య హింస మరీ తప్పు,
ప్రతి హింస తప్పు కాదు -" ఇది కాళోజీ కవితా వాణి - బాణి.

'ఆంధ్ర సారస్వత పరిషత్తు,' ప్రథమ వార్షికోత్సవం వరంగల్లు (1944)లో జరుగుతున్నప్పుడు ముస్లిం సిపాయీలు సభా వేదికను పీకి, కాల్చివేస్తే, 'ఓరుగల్లు' కోటలోని సీతాపతి ఖుషీ మహల్ సభా భవనంలో సభ జరిగింది. సురవరం, మాడపాటి, బూర్గుల, దాశరధి... ప్రముఖ కవులు పాల్గొన్న ఆ వేదిక మీద నిలబడి కాళోజీ కంఠమెత్తి - ఒత్తి వినిపించిన కవిత ఇది -

"కూలి పోయిన కోట గోడలను చూసి / శిథిలమైన గుళ్ళ శిల్పముల చూసి
పురుగు పట్టిన తాటి పొత్తముల చూసి / తుప్పు పట్టిన కత్తి తునకలను చూసి..."

కుంగిపోక, ప్రస్తుత దీనావస్థను గమనించి, భావదాస్యం వీడి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేటందుకు పూనుకోవన్నని గట్టిగా హెచ్చరించాడు.

ఎప్పుడూ ప్రభుత్వాలకు, సంప్రదాయాలకు అణగిమనిగి ఉండే స్వప్రయోజకుల చూసి,

"నాది నిత్యనూత్న వికసిత జ్ఞానం
మీది బుద్ధిజాఢ్య జనితోన్మాదం -"

అని, అనిన ధీశాలి కాళోజీ - 'బుద్ధి జాఢ జనితోన్మాదం' పదబంధప్రయోగం పెద్దన మనుచరిత్రలోనిది. ఇది కాళోజీ పాండిత్యానికి నిదర్శనం.

ఆయన కవితలు, సీసపద్య పాదాలుగా, ద్విపదలుగా ఉంటవి. కొంత మెలకువ పాటిస్తే అవి ఛందోబద్ధ పద్యాలయ్యేవి. ఆ శ్రద్ధ, ఆసక్తి అతనికి లేవు. మాట - పాట మన కాళోజీ బాట.

1950 కి పూర్వమే వచన కవితలు రాసి శ్రీశ్రీ, ఆరుద్ర... వరుసలో వీరు స్థానం సంపాదించుకున్నరు. అవీ లయబద్ధాలే.

**"జీవి కవసరాల వేట / చీకటిలో పునుకులాట**
**ఎత్తు వంతలది దారి / ఎరుగక పాడు సవారి -"** (వంత, సవారి మాండలికాలు)

గాంధీయిజాన్ని అభిమానించినా శాంతివాదిగనే ఉండిపోలేదు. సామ్యవాదాన్ని ప్రేమించినా కమ్యూనిస్టు కాలేదు. కులమతాల బలపరుచక - ఖండించినా నాస్తికుడు అనలేదు. వారి ఈ మాటలు వినండి -

"ఒకడేమో 'నా విష్ణుః పృథ్వీపతిః' దేవుడు కాంది రాజు కాలేదు అంటడు. ఇంకోడు 'Devine Right of King' రాజ్యాధికారం దైవికమైందంటడు. మరొకడేమో 'జిల్ అల్లాహ్' దేవుని నీడే రాజు అని. అందరూ రాజును దేవునితో ముడిపెట్టి, రాజు చేసే పని విషయంలో ఎవ్వరూ ప్రశ్నించే వీలులేదనే వాండ్లే. ఆ ప్రశ్నించొద్దు అనేది పోయి ప్రశ్నించడం తప్పని సరి కావాలె (ప్రగతి - ఫిబ్రవరి 2003, పుట 6). ఇంకా ఆయన ఇట్లన్నరు : "ఆనాటి ప్రభుత్వాన్ని ఆనాడు అడిగిన, ఇవ్వాల్టి ప్రభుత్వాన్ని ఈనాడు అడుగుతున్న. ఎప్పుడూ అడుగకుండా ఉండలేను (జూలై 17, 2000). అది నిజం. నాడు నైజాం విముక్తి పోరాటంల పాల్గొన్నరు. ఆ తర్వాత మన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన్రు కాళోజీ.

కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రభుత్వం సమర్పించిన బడ్జెట్‌ను కాళోజీ ఎమ్మెల్సీగా విమర్శించిన వైఖరి చూడండి -

**"కాసుమాయలో అంకెలు / బ్రహ్మానందము బడ్జెట్**
**బహురూపుల నిపుణతలో / బ్రహ్మాంతటివీ అంకెలు"**

లాల్ బహద్దూర్ శాస్త్రి దేశ ప్రధానిగా ఉన్నప్పుడు తిండి కొరత తీర్చటానికి దేశ ప్రజలను వారానికి ఒక పూట ఉండన్నని పిలుపు ఇచ్చినప్పుడు -

**"ఓయీ భారత ప్రధాని / కొవ్వు బలిసినోనికి చెప్పు**
**నెయ్యి మా నెయ్యిమని / ధనం దాచినోనికి చెప్పు / పాతర్లు తియ్యిమని" -**

కష్టజీవులు కాలే కడుపులతో పస్తులుండ లేరన్నాడు.

ప్రధాని నెహ్రూ పాలనా కాలంలో

**"నీ వారసు రాజ్యంలో / నీతికి తావేది బాపు !**
**నీ మాటలు విని ప్రాణము / నిలపుకునేదెట్లు బాపు?" (1963)**

నెహ్రూ 'పంచశీల'ను -

**"భూగోళం పుక్కిట పట్టే / భూపావళి పరాక్రమానికి**
**పని కొస్తుందీ పంచతంత్రం / ముఠాబందీలకు**
**వ్యక్తుల స్వార్థ తత్వాలకు / అది తప్పని సరి..." (1954)**

అక్రమాల, అన్యాయాల నిరసన కాళోజీ కవిత్వం. ఆయనది సమాజం బాట - స్వతంత్రం బాపుటా.

మన దేశ ప్రధాని పి.వి. తన మిత్రులైనా అవసరమైనప్పుడు ఆయన పాలననూ విమర్శించక పోలేదు కాళోజీ.

తన విద్యా గురువు గార్లపాటి రాఘవరెడ్డి పై ఎంతో గౌరవం. విశ్వనాథను, శ్రీశ్రీని సమానంగా ప్రేమించిండు. కాళోజీకి నిజం తప్ప ఏ ఇజమూ లేదు.

1974లో హైదరాబాద్ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంథాలయంలో పి.వి. సమక్షంలో కాళోజీ షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా జరిగింది.

1953లో 'అలంపురి'లో కాళోజీ 'నా గొడవ' కవితా సంపుటిని ఆవిష్కరిస్తూ శ్రీశ్రీ వీరిని 'లూయీ ఆరగాన్' అన్నారు. ఏడాదిలోనే దాని రెండవ ముద్రణ దాశరథి కృష్ణమాచార్య పీఠికతో వచ్చింది.

1943లో వచ్చిన 'కాళోజీ కథలు' పుస్తకాన్ని తర్వాత వరవర రావు ప్రచురించిను.

1941లో 'అణా గ్రంథమాల' తరపున అచ్చయిన వీరి పుస్తకాల ప్రచురణ, 2001లో 'కాళోజీ ఫౌండేషన్' మిత్రులు వెలువరించిన 'కాళోజీ గొడవ' 200 రూ.ల వెలగల బృహద్గ్రంథం వరకు కొనసాగింది. అరవై రెండేండ్ల సాహితీ రంగ సుదీర్ఘ యాత్ర కాళోజీది.

"చల్లారని అగ్ని పర్వతానికి 89 ఏండ్ల వయస్సు శీర్షికలో పి. లోకేశ్వర్ రాసిన వ్యాసం (15 సెప్టెంబర్ 2002 'నా తెలంగాణ' వార పత్రిక, పు. 26, 27) కాళోజీ జన్మదినం 9-9-2002 వేడుకను ఇట్లా వివరించింది - ఆ దినమంతా స్థానిక, రాజధాని, ఇతర జిల్లాల మాన్యులు - సామాన్యులు వచ్చి వారిల్లు ఎంతో సందడి, సాహిత్య, రాజకీయ వాతావరణం. అదే రోజు "కాళోజీ పుట్టిన రోజు" సందర్భంగా "తెలుగు మాండలిక భాషా దినోత్సవం" సభ జరిగింది. డా॥ జయశంకర్ అధ్యక్షత వహించగా ప్రముఖ కవులు, వక్తలు ఇదే వ్యాసం "గోల్కొండ ఖిల్లా" మాసపత్రిక ప్రారంభ సంచిక (సెప్టెంబర్ 2002) కూడ ప్రచురించింది. అదే 2002 నవంబర్‌లో కాళోజీ కీర్తి శేషులు (అనేక పత్రికలు కాళోజీ విశేషాలు ప్రచురించినై. అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సంపాదకత్వంలో వెలువడుతున్న "మిసిమి" మాసపత్రిక డిసెంబర్ 2002 సంచిక 'కాళోజీ ముఖచిత్రం' కె.జితేందర్ వ్యాసంతో వెలువడింది).

మన తెలుగు భాషను గురించి ఆ మహాకవి అభిప్రాయం విందాం:

"వాడుక భాష అనేది కొన్ని ప్రాంతాలకే పరిమితం కాదు. అన్ని రకాల (అన్ని ప్రాంతాల) మాండలికాలకు తగిన ఆదరణ ప్రోత్సాహం ఉండాలె. దాని కోసం అందరమూ కృషి చేయాలె." (9-9-2002) ఇది ఆ ప్రజాకవి మనకిచ్చిన సందేశం.

నిజానికి 'తెలుగు మాండలిక భాషా దినం' 2001లోనే ఆరంభమైంది. 2002 రెండవ వార్షిక పర్వం. మూడవ యేటికి (9-9-2003) కాళోజీ లేరు. కీర్తి శేషులు.

గిడుగు వెంకట సీతాపతి జన్మదినం 29 ఆగష్టు. "తెలుగు (వ్యావహారిక) భాషాదినం" గా మనం ఉత్సవం జరుపుకుంటున్నాం. అట్లనే మన తెలుగు మాండలిక భాషపై అత్యంత అభిమానం - అభినివేశం కల మన జనం కవి 'కాళోజీ' జన్మదినాన్ని 'తెలంగాణా మాండలిక భాషా దినోత్సవం'గా మనం జరుపుకోవన్ననే సంకల్పం మొట్ట మొదట 'నవ్యసాహిత్య పరిషత్, కరీంనగర్, వారికి కలిగింది 2001లో. అంతకుముందే 2000 అక్టోబర్‌లో ఈ సంస్థ ప్రముఖ రచయిత్రి ప్రొ॥ పి. యశోదా రెడ్డి కోరికపై 'తెలంగాణా మాండలిక భాషా సదస్సు నిర్వహించి 17 గురు వక్తల ప్రసంగ వ్యాసాలతో 'మా తెలుగు పలుకు' సంకలన పుస్తకం ప్రచురించింది. 2001 కాళోజీ జయంతిని 'తెలంగాణా మాండలిక భాషా

దినం'గా జరుపుకుందామని కాళోజీ అనుమతిని కోరుతూ లేఖ రాస్తే - 'తెలంగాణా' పదానికి బదులు 'తెలుగు' అనే పదం చేర్చి / మార్చి వారు తమ ఆమోదం తెలిపిన్రు. 9-9-2001 కాళోజీ జయంతి - హన్మకొండ సభలో ఆయన స్వయంగా నాగిళ్ళ రామశాస్త్రి ద్వారా ఈ విషయం ప్రకటించిన్రు. ఆ యేడు మా కోరికగా కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నల్గొండ, హైదరాబాద్ (తె.ర.వే. తె.సాం.వేదిక) ఈ సభలు జరిపినై. తమ సభల్లో ఈ (తె.మాం.భా.ది) విషయాన్ని ప్రకటించినై. మూడవ సంవత్సరం కాళోజీ మృతి సంవత్సరం. అయినా జయంతి భాషా సభలు జరిగినై.

నాలుగవ సంవత్సరం (9-9-2004) కాళోజీ ఫౌండేషన్ ఆహ్వానంపై నేను (ఈ వ్యాసకర్త - డా॥ మలయశ్రీ) ప్రధాన వక్తగా కాళోజీ జయంతి 'తె.మాం. భాషాదినోత్సవం' హన్మకొండ సభకు వెళ్ళిన డా॥ జయ శంకర్ సభాధ్యక్షులు. శ్రీమతి రుక్మిణమ్మ కాళోజీ క్యాసెట్లు, పుస్తకాల ఆవిష్కర్త. 9 సెప్టెంబర్ 'కాళోజీ జయంతి'ని 'తెలుగు మాండలిక భాషా దినోత్సవం'గా జరుపుకుందామని (2003-2005ల్లో) తెలుగు భాషోద్యమ సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘాల (నేను, డా. కాలువ మల్లయ్య మొ॥)ను కోరినం. ప్రతి యేటా ఇదే ఆచారాన్ని కొనసాగిద్దామని నేటి నిజం, నడుస్తున్న చరిత్ర, ప్రజాసాహితీ, ప్రజాతంత్ర, తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ సాంస్కృతిక వేదిక, మొ॥ పత్రికల సంపాదకులను, సంస్థల అధ్యక్షులను కోరినం - సంప్రదించినం. మెజార్టీ వ్యక్తుల ఆమోదం లభించింది. ఒకటి, రెండు రాజకీయ పత్రికలు ఈ విషయంపై స్పందిస్తూ లేవింకా. అవి 17 సెప్టెంబర్ 1948 నైజాం / తెలంగాణా విముక్తి ప్రముఖ దినాన్నే పట్టించుకుంటూ లెవ్వు. ఏమందాం.

తెలంగాణ సంస్థలు కొన్ని కాళోజీ జయంతిని 'తెలంగాణా భాషా దినం' అని మార్చుకున్నట్లు తెలుస్తున్నది. ఒకవేళ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే ఆ పేరు సరిపోవచ్చు. ఇప్పుడు మాత్రం 'తెలుగు మాండలిక భాషాదినం' అంటేనే ఔచిత్యం. కాళోజీ ఆశయం అదే, మా కోరికా అదే.

"నాది బడి పలుకుల భాష కాదు. పలుకు బడుల భాష" అని చెప్పిన పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావుకి ఎన్నో సన్మాన సభలు జరిగినై - అభినందన సంచికలు వచ్చినై. అయినా వారి జన్మదినం 'తె.మాం.భా.ది' సేత ఆ సంపూర్ణ సాహిత్య మూర్తికి మనమిచ్చే విలువైన కానుక కాగలదు.

ఈ ఉత్సవ సందర్భంగా నా వ్యాసాలను (2005, 2006) ఆంధ్రజ్యోతి, నేటి నిజం, నడుస్తున్న చరిత్ర, వెలుగు, మన ఊరు మొదలగు పత్రికలు ప్రచురించినై. ఈ 7వ సంవత్సర తె.మాం.భా. ది. (9-9-07) ఆంధ్రభూమి, మిసిమి పత్రికలకు వ్యాసాలు, నడుస్తున్న చరిత్ర, విశాలాంధ్ర, నేటి నిజం పత్రికలకు కవితలు పంపిన.

హన్మకొండ (9-9-07) సభలో వి.వి. తె.మాం. భాషపై మంచి ప్రసంగం చేసినట్లు 'మన తెలంగాణా' సంపాదకులు కర్ర ఎల్లారెడ్డి లేఖా వార్త. ఆనాడు ఉదయం కరీంనగర్‌లో 'సారస్వత జ్యోతి - మిత్రమండలి' నిర్వహించిన ('కా.జ. - తె.మాం.భా.ది.) సభలో నేను పాల్గొని ప్రసంగించిన. సాయంత్రం 'సాహితీ గౌతమి' సభ జరిపింది.

ఇతర జిల్లాల్లో - రాజధానిలో ఈ సభలు జరిగి ఉంటవి. ఏటా ఇదే సదాచారాన్ని ఆనవాయితీని కొనసాగిద్దాం. లోకమాన్య జయప్రకాశ్ నారాయణ్ మృతికి కాళోజీ చెప్పిన మినీ కవిత అచ్చంగా వీరికి అన్వయిస్తుంది. కాబట్టి దానితోనే ఈ వ్యాసాన్ని ముగిస్తున్న.

"పుటక నీది, చావు నీది,
బ్రతుకంతా దేశానిది!"

# నాదు జాతి, నాదు దేశము, నాదు భాష

- డా॥ అద్దంకి శ్రీనివాస్

ఉవ్వెత్తున ఎగసిన కెరటంలాంటి చైతన్యంతో సాగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో అదే స్ఫూర్తితో ఆంధ్రులు పోరాడారు. నిండైన దేశ భక్తి అందించిన కొత్త ఊపిరి పోసుకొని తెలుగు కవులు శంఖారావాన్ని పూరించారు. వివిధ ప్రక్రియలను వాహికలుగా చేసుకొని రచనలు చేసి ఉద్యమానికి ప్రేరకులయ్యారు. ప్రజలను దేశం కోసం పాటుపడే విధంగా తయారు చేయడం కోసం దేశభక్తిని నూరిపోసినందుకు కవుల కలాలు జోరుగా సాగాయి. దేశౌన్నత్యం, పురావైభవం, మహనీయుల కీర్తనం, ఆంగ్లేయుల దౌష్ట్యం వంటివన్నీ వస్తువులైనై.

జాతీయోద్యమ కవిత్వాన్ని పుష్కలంగా రచించిన కవి రాయప్రోలు సుబ్బారావు "నాదు జాతి, నాదు దేశము, నాదు భాష అను అహంకార దర్శనమందు" అని ప్రబోధిస్తూ జాత్యాభిమానం, దేశాభిమానం, భాషాభిమానం ప్రతి ఒక్కరికీ నరనరాల్లో జీర్ణించుకుపోయేలా సృజన చేశారు. ఈ స్పృహ తెలుగు సాహిత్యంలో ఆధునిక కాలం నుండే వచ్చింది. అంతకు ముందు సాహిత్యంలో ఈ స్పృహ ఉన్నప్పటికీ దాని లక్ష్యం, పరిధి వేరు. గురజాడ అప్పారావు దేశభక్తి గేయం మొదలుకొని ఈ అభిమాన త్రయాన్ని బోధించే సాహిత్యమంతా ఒక ఉద్యమ స్ఫూర్తితో, చైతన్య దీప్తితో, సంస్కరణాత్మకమూ, ప్రబోధాత్మకమూ అయిన గమ్యం వైపే సాగింది. ఈ నేపథ్యం గల సాహిత్యంలో రాయప్రోలు వారు చెప్పిన మూడు అభిమానాలను స్పృశించడమే ఈ వ్యాసోద్దేశ్యం.

1905లో జరిగిన బెంగాల్ విభజన దేశంలో జాతీయోద్యమ స్ఫూర్తి మిన్నంటేందుకు దోహదం చేసింది. ఈ సంఘటన ఒక్క వంగదేశాన్నే కాక దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలనూ చైతన్యపరిచింది. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటించి వివిధ ప్రాంతాలలో ఉపన్యసించారు. రాజమహేంద్రవరంలో వారి ఉపన్యాసం విని ఉత్తేజితులై చిలకమర్తి వారు రాసిన "భరత ఖండంబు చక్కని పాడియావు" అనే పద్యంలో హిందువులను పీడిస్తున్న ఆంగ్లేయులను విమర్శిస్తూ మొట్టమొదటిసారిగా "నాదు జాతి" అనే అభిమానాన్ని ప్రకటించారు. తన జాతి కోసం చెరసాల పాలైన జాతీయ నాయకులను దైవ స్వరూపులుగా భావించి, వారి త్యాగాన్ని కీర్తిస్తూ ప్రజలలో త్యాగ నిరతిని, దేశభక్తిని పెంపొందింపజేసే రచనలు చేశారు.

> "చెరసాలల్ పృథు చంద్రశాలలె యగున్, చేదోయి గీలించు న
> య్యర దండల్ విరిదండలయ్యెడును, హేయంబైన చోడంబలే
> పరమాన్నంబగు, మోటుకంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
> స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్చు నవ్వానికిన్"

జాతి ఔన్నత్యం, పురా వైభవం, జాతీయోద్యమ నేతల దేశభక్తి, జెండా, రాట్నం వంటివన్నీ కవితా వస్తువులే. ప్రతి పదంలోనూ జాతిని ఉత్తేజపరిచి, సంఘటితం చేసి ఒక మహత్తర శక్తిగా తయారు

డా॥ అద్దంకి శ్రీనివాస్, తెలుగు శాఖ, హైదరాబాద్ యూనివర్సిటీ, హైదరాబాదు.

కావాలన్న ఆశయం కవితా రూపమైంది. రాయప్రోలు, విశ్వనాథ, కొడాలి, జాషువా, తుమ్మల ఆంధ్రజాతిపై అభిమానాన్ని ప్రకటించినవారే.

"అవమానమేలరా! అనుమానమేలరా! భారతీయుడనంచు భక్తితో పాడ"

"లేరురా మనవంటి వీరులింకెందు"

"ఏ పూర్వ పుణ్యమో ఏ యోగ బలమో జనియించినాడవీ స్వర్గ ఖండమున" అనే రాయప్రోలు గీతాలు భారతజాతిపై వారికి కల అభిమానానికి నిదర్శనాలు. తమ్ముడా గేయంలో రాయప్రోలు కీర్తించిన జాతి ఔన్నత్యం ప్రజలను ఉత్తేజితులను చేసింది. దువ్వూరి రామిరెడ్డిగారి ప్రబోధ శంఖం, స్వాతంత్ర్య రథం గేయాలలో జాత్యాభిమానంతో కలసిన తెల్లవారి ఆధిక్యంపై నిరసన ఉంది.

జాతి సౌభాగ్యమే తన లక్ష్యమంటూ సాగిన గాంధీజీని ఆదర్శంగా, మహాత్ముని తెలుగు కవులు వర్ణించారు. గేయాలలో, కావ్యాలలో కీర్తించారు. బసవరాజు అప్పారావుగారు 'కొల్లాయి కట్టితేనేమి', 'వేణునాదం', 'స్వరాజ్యలక్ష్మి పెండ్లి', 'గాంధీ ప్రభ' మొదలైన గేయాలలో గాంధీ మహాత్ముని కీర్తించారు. గాంధీని రామునిగా, అల్లాగా, క్రీస్తుగా చిత్రించి అన్ని మతాలవారికి గాంధీ చెందేటట్లు నాయకునిగా భావింపజేశారు. ఈ స్ఫూర్తితో గాంధీపై భజనలు, కీర్తనలు, మంగళ హారతులు, హరికథలు, బుర్రకథలు వెలిశాయంటే మన తెలుగు కవులకు జాతిని ఉద్ధరించే నాయకుల పట్ల, జాతి పట్ల గల అపారమైన అభిమానం.

విదేశీ వస్తుబహిష్కరణలో కవుల ఆత్మలలో గిరగిరా తిరిగింది రాట్నం. "తిప్పవే రాట్నమా దేశ చక్రంబు, విప్పవే రాట్నమా విజయకేతనము" అని దువ్వూరి రాట్నపు పాట రాశారు. దేశంలోని నదులు, కొండలు, విద్యాలయాలు, మతాలు, సంస్కృతి గొప్పగొప్ప రాజులు, వీరులు, ధీరులు తెలుగు కవుల కలాల నుండి ఉద్యమ స్ఫూర్తి కోసం వచ్చిన కవితా వస్తువులు. గరిమెళ్ళ సత్యనారాయణ 'స్వరాజ్య గీతాలు', ఉన్నవ లక్ష్మీనారాయణ 'భావ తరంగాలు', దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 'రాంభజన కీర్తనలు,' కొండపల్లి జగన్నాథదాసు 'స్వరాజ్య నవనీతము' జాతీయ స్ఫూర్తినిచ్చాయి. గడియారం 'శివభారతం', రాజశేఖర శతావధాని 'రాణా ప్రతాపసింహ చరిత్ర' భారత జాతీయత వాసనా మాత్రంగా గలవే. దువ్వూరి 'ద్రౌపదీ సందేశం', చామర్తి రాజశేఖరరావు 'పాంచాలీ స్వాంతనము' కావ్యాలలో పాత్రలు పౌరాణికాలే అయినా జాతీయోద్యమం కోసం కొత్త స్వరూపాల్ని సంతరించుకున్నాయి.

కవి, సమాజం ఎన్నటికీ వేరు కాదు. రాసేది ధనుర్భంగమనే అంశమే అయినా, నాడు తన చుట్టూ ఉన్న ఉద్యమ స్ఫూర్తిని కరుణశ్రీ 'ఉదయశ్రీ' కావ్యంలో ఎంత చక్కగా ధ్వనింపజేశాడో చూడండి.

"చెల్లరే విల్లువవిరుచునే నల్లవాడు
పది పదారేండ్లయెల రాచ పడుచువాడు
సిగ్గు సిగ్గంచు లేచి గర్జించినారు
కనులు గుట్టిన తెల్ల మొగాల వారు"

" 'నల్లవాడను' పదమును భారతీయ వీరునికి 'తెల్లమొగాల వార'న్న పదమును ఇంగ్లీషు దొరలకు సంకేతముగా గ్రహింపవచ్చున''ని సినారే అభిప్రాయపడ్డారు.

జాతీయోద్యమానికి సమాంతరంగా ఆంధ్రోద్యమం కూడా స్ఫూర్తినివ్వడానికి ఆంధ్రదేశంలో ఏర్పడిన పరిస్థితుల కారణంగా ఆంధ్రుల ఔన్నత్యా పతాకాలు పైకి లేచాయి. ఆంధ్ర చరిత్ర, సంస్కృతి, శౌర్యప్రతాపాలు, వర్తక వాణిజ్యాలు, కళలు, కట్టడాలు మొదలైనవన్నీ చిత్రింపబడ్డాయి. గతంలో ఆంధ్రులు సాధించిన విజయాలు, పురా వైభవాలను కీర్తిస్తూ, ప్రస్తుత పరిస్థితులతో సమన్వయం చేస్తూ గత వైభవమనే చూరు కింద నిలబడి చుక్కల్ని లెక్క పెట్టే నైజాన్ని నిరసించారు. పునరుద్ధరణ, పునరుజ్జీవం కోసం కొత్త గొంతుల్ని విప్పారు. దీనికి శ్రీకారం చుట్టింది రాయప్రోలు వారే అయినా వారికంటే ముందు 1914లో గడ్డము కొండారెడ్డి, 1916లో మండపాక పార్వతీశ్వర శాస్త్రి, గాదె జగన్నాథస్వామి, తిరుపతి వేంకట కవులు తత్కాలీన ఆంధ్రదేశ దుస్థితిని, తదుద్ధరణ కోసం చేపట్టవలసిన కర్తవ్యాన్ని ప్రస్తావించారు.

ఆంధ్రుల కీర్తి, ప్రతాపాగ్ని, తెలుగు వాణి రాయప్రోలు కవిత్వంలో కీర్తింపబడ్డాయి. రాయప్రోలు వారి కవిత్వంలో జాత్యాభిమానం, దేశాభిమానం, భాషాభిమానం ముప్పేటలుగా పెనవేసుకున్న దేశభక్తితో జాతికి కొత్తగా జవసత్వాలనందించాయి.

"అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు'' అంటూ గత వైభవాన్ని; "సిరులు పొంగిన జీవగడ్డలు, పాలు పాఱిన భాగ్యసీమయి వ్రాలినది ఈ భరతఖండంబున భక్తి పాడర తమ్ముడా! దేశగర్వము దీప్తి చెందగ దేశ చరితము తేజరిల్లగ దేశమరసిన ధీర పురుషుల తెలసి పాడర తమ్ముడా!'' అంటూ దేశౌన్నత్యం చెప్తూ దేశ భక్తిని పుట్టించేందుకు ఆవిష్కరించారు. భారతదేశం, తెలుగుదేశం, తెలుగు నేల, తెలుగు కత్తి, తెలుగు శిలలు, కోటలు, పట్టణాలు, బురుజులు, ఆచార్యులు, విశ్వవిద్యాలయాలు, మహర్షులు, మత ప్రవక్త ఈ నేపథ్యంలో వచ్చిన రచనలలో కనిపిస్తాయి. తెలుగునాట గల వర్ణాలు, స్త్రీ పురుషుల సౌందర్య ప్రస్తావనలు, శౌర్య ప్రస్తావనలు, కళలు, అభిరుచులు, సంస్కృతీ విశేషాలు, చేసిన దానాలు, ఏలిన ఊళ్ళు, క్షేత్రాలు, ఆంధ్ర రాజుల పాలనలు, చారిత్రక పురుషుల వీరోచిత కృత్యాలు అన్నింటినీ తవ్వితీసి పాఠకులకు చైతన్యాన్ని దీపింపజేసిన కావ్యాలు, గేయాలు దేశభిమానాన్ని ప్రకటిస్తున్నాయి. వీటిలో రాయప్రోలు 'ఆంధ్రావళి' విశ్వనాథ 'ఆంధ్ర ప్రశస్తి', 'ఆంధ్ర పౌరుషం', తుమ్మల 'రాష్ట్ర గానం', గంటిజోగి సోమయాజి 'రామచంద్రుని హంపీయాత్ర', జాషువా ఖండకావ్యాలు, 'ముంతాజ్‌మహల్', కొడాలి 'హంపీ క్షేత్రము', పుట్టపర్తి 'పెనుగొండ లక్ష్మి', ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'దక్షారామం', శ్రీనివాస సోదరుల 'ఓరుగల్లు కోట' ప్రసిద్ధాలు.

"శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణములైనవి తుంగభద్రలో
పలి గుడి గోపురంబులు, సభాస్థలునవి కొండముచ్చు గుం
పులకు, చరిత్రలో మునిగిపోయినదాంధ్ర వసుంధరాధిపో
జ్జ్వల విజయ ప్రతాపరభసంబొక స్వప్న కథా విశేషమై" అని కొడాలి వారు గత వైభవం నేటి

దుస్థితిని అశ్రుపూరకంగా ప్రకటించారు. రావోయీ "అదునాతనాంధ్ర సుకుమారా! రమ్మ" అంటూ క్షేత్ర వైభవంలోనికి పాఠకుణ్ణి సాదరంగా ఆహ్వానిస్తూ ఇంద్రగంటి క్షేత్ర ప్రశస్తిని దక్షారామ కృతి కావించారు. తన 12వ యేటనే 'పెనుగొండ లక్ష్మి' దర్శించి హృదయోద్వేగంలో ఆవిష్కరించిన పుట్టపర్తి నారాయణాచార్యులు తెనుగు ఢంకాలు మ్రోగిన దివ్యభూమిని కొనియాడారు. విశ్వనాథ సత్యనారాయణ -

"గోదావరీ పావనోదార వాః పూర
మఖిల భారతము మాదన్న నాడు
తుంగభద్రా సముత్తుంగ గానము తోడ
కవుల గానము శ్రుతిగలయు నాడు
పెన్నానదీ సముత్పన్న కైరవదళ శ్రేణిలో
శ్రేణిలో తెవాసించు నాడు
కృష్ణా తరంగ నిర్నిద్ర గానము తోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు

అక్షర జ్ఞానమెరుగదో ఆంధ్రజాతి
విమల కృష్ణానదీ సైకతముల యందు
కోకిలపు బాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు"

విశ్వవీధిన వినుతికెక్కిన భారతీయ కీర్తిని, కళా వైభవాన్ని వర్ణించారు. జాషువా 'పచ్చిబాలెంతరాలు మా భరతమాత, మాతలకు మాత సకల సంపత్సమేత' అని దేశాన్ని తల్లిగా భావన చేసి, షట్చక్రవర్తులు, శ్రీకృష్ణుడు, బుద్ధదేవుడు వంటి మహనీయులు కల దేశంగా అభివర్ణించారు. దేశ వైభవాన్ని గేయాలలో కీర్తించిన వారిలో గురజాడ కంటే ముందు 'మేలుకొనుమీ భరతపుత్రుడ' అనే గేయకర్తలో కనిపిస్తుంది. గురజాడ దేశభక్తి విశ్వజనీనమైనది. రాయప్రోలు జన్మభూమి గేయం దేశాభిమానాన్ని ప్రతి పదంలోనూ ప్రకటించే జాతీయమైన గేయం.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

తెలుగు దేశ ప్రత్యేకత, చరిత్ర, తేజం, శౌర్యం, ధర్మం వంటి వాటిని వర్ణిస్తూ దేశాభిమానాన్ని భారతదేశ పరంగానూ, ఆంధ్రదేశ పరంగానూ వ్యక్తం చేశారు. "తెలుగు తల్లీ నీకు జోహారు... దేశమాతా నీకు జేజేలు... నీ పాలు జుంటి తేనియల తేటలో గోస్తనీపక్వరసమో, సుధాపూరమో..." అంటూ తుమ్మల సీతారామమూర్తి గారు తెలుగు భాగ్యాన్ని వర్ణించారు.

జాతీయోద్యమ స్ఫూర్తితో ఆంధ్రోద్యమం కూడా ప్రారంభమయ్యింది. దీనికి విజ్ఞాన చంద్రికా మండలిని స్థాపించడం (1907), సాహిత్య సంఘ సమావేశం (1910), ప్రథమాంధ్ర బాపట్ల మహాసభ (1913) ప్రధాన భూమికలు. మద్రాసు, ఆంధ్ర రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా మద్రాసే ఉండేది. కాబట్టి తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే భావన ఆంధ్రులకు ఏర్పడింది. అప్పటి నుండి ఆంధ్రుల ఘనకీర్తుల గురించి, చరిత్ర గురించి, కళల గురించి, భాషా సాహిత్యాల గురించిన వర్ణనలు, కీర్తనలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోంచే తెలుగు భాషపై పద్యాలు, గేయాలు వచ్చాయి. నా మాతృభాష ఎంతో తీయనిదంటూ, భాషను తల్లిగా భావించి కీర్తించడం అతివేలంగా సాగింది. నేడు నిరాదరణకు గురవుతున్న తెలుగు భాషపై మమకారాన్ని పెంచి భాషాభిమానాన్ని కలిగించేందుకు తెలుగు కవులు తెలుగు తల్లిని కీర్తించిన రచనలు దోహదం చేస్తాయి. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న ప్రస్తుతి క్రీడాభిరామంలో ఉంది. ప్రాచీన కవులూ తెలుగు భాషను వేనోళ్ల కీర్తించారు. అయితే ఆధునిక కాలంలో కవులు ఆంగ్ల భాషా సంస్కృతుల ప్రభావం వల్ల విషమ స్థితిలోనికి నెట్టబడ్డ తెలుగు భాషపై తమ అభిమానాన్ని కవిత్వీకరించారు. ఆంధ్ర జాతి, ఆంధ్ర దేశం, ఆంధ్ర భాష ఈ మూడింటినీ కవితా వస్తువులుగా స్వీకరించారు. "మీగడలు, తేనెలు, పూల లావణ్యాము, సెలయేటి ఒయ్యారము కలగలసిన తెలుగు భాష రూపొందెనని వారుత్ప్రేక్షించిరి.

> "ఊరక రాష్ట్రమూడిపడు నొక్కొ మహేశ్వరినట్లు మాతృ భా
> షా రమణిన్ భజించుటకు సంబరమందని చచ్చు జాతికిన్" అన్న తమ్ముల వారి మాటల్ని

బట్టి ఆనాటి భాషాభిమానం ఎంతగా ఉందో తెలుస్తుంది.

రాయప్రోలు ఆంధ్రావళిలో --

> "వంశిన్ వంచి మృణాలమున్ మెలచి పక్వద్రాక్షనెండించి వా
> గంశల్ సుస్వర మాధురీ సురభిళ ప్రాణంబు జిల్కన్ దశ
> త్రింశల్లక్ష జనప్రసన్న రసనా దేవాలయాభ్యంతర
> ప్రాంశు ప్రార్థన గీతమైన తెనుగుం బల్కుం బ్రశంసించెదన్" అంటూ మృదుమధురమైన

తెలుగుభాషను కొనియాడారు. తెలుగుకు సాటి మరేదీ లేదని తుమ్మలవారు రాష్ట్రగానంలో 'కమ్మని తెల్గటంచు నుడికారము సొంపుల నీ విశాల విశ్వమ్మున దీని బోలిన వచస్సు నభస్సుమ'మన్నారు. ఇద్దరు తెలుగువారు కలిస్తే కచ్చితంగా తెలుగు మాట్లాడారనే విషయాన్ని రాష్ట్రగానంలో ఇలా చెప్పారు.

> "ఇద్దరు తుల్గువాండ్రు తమ యింటిని కష్టసుఖాలు చెప్పుకో
> నద్దిర మాతృభాష తగదా మరి యింకొక పెద్ద రోగమే కద్దు
> కద్దు వచింతు నాంగ్లము మొగంబు నెఱుంగని శ్రోతముందు దు
> ర్బుద్ధులు కూయుచుండ్రు పలుపోకల నెంగిలిపీసు కూతలన్"

ఇక తెలుగు భాషపై కొండంత మమకారంతో విశ్వనాథ "అఖిల పశ్చిమ రాజ్యభాషాళిలో తన తెలుగు మాటలు విస్తరించాయని, ఒక సంగీతం పాడే విధంగా, స్పష్టోచ్చారణ కల్గి భావ వ్యక్తీకరణలో

అమర భాషకు దీటైన భాష అని, చక్కని చమత్కారం పండించేందుకు వీలున్న భాషని, పది భాషలు తెలిసిన ప్రభువు మెచ్చిన భాషని, తన ఛందస్సు నడకలలో అందం కల భాషని పరిపరి విధాలుగా కీర్తించారు. తన తెలుగెంతో మేటి అని ఎన్నో ప్రయోజనాలను చేకూర్చేదని భావించారు."

"అంతగా నోటితో నందుము వ్రాయుదు
మంతగా నంతందమైన భాష
భాషించువారి ఉచ్ఛ్వాస నిశ్వాసముల్
వెలయించి యాయువు పెంచు భాష
పలు మాటల్యు సవ్వడి చేత జనముల
శీలమ్ము సమరించు మేలి భాష
చెట్ట ఎంతగ పాడు చేయ నెంచిన నైన
నా వంత మొక్క వోనట్టి భాష
అణువు మొదలు బ్రహ్మాండ పర్యంత మొప్ప
బ్రదుకు, బాసయు నంత పర్యంత ముండు
అంత వ్యాపించి వెలిగెడునట్టి భాష
దివ్యమై చావులేనిది తెలుగు భాష" అని తెలుగు భాష జీవద్భాషగా పేర్కొంటూ భాషా శాస్త్ర స్వరూపాన్ని కూడా ఇక్కడ ప్రస్తావించారు.

సురవరం ప్రతాపరెడ్డి కూడా తెలుగు భాషను గౌతమీ జలాలతోనూ, ఖండశర్కర జాతి ఖర్జూర గోక్షీర ద్రాక్షాదియుత రామ రసంతోనూ పోల్చి, తేట తేనెల నవకంపు సోనలకు మా తెలుగు భాషామతల్లి సాటియైనదని కీర్తించారు. ఆరుద్ర తేనే కన్నా మధురమైనది తెలుగు భాషని, ఆ తెలుగుదనం మా కంటి వెలుగని, గత చరిత్ర ఘనమైనదేనని, కానీ, గతం కన్నా భవిష్యత్తు ఆశాజనకం కనుక ఆ భావి కొరకు దీక్షా తిలకం ధరించాలని విజ్ఞప్తి చేశారు. జాతి మరువని ప్రసన్న కవి అయిన శంకరంబాడి సుందరాచారి రచించిన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గేయం సమకాలీన ఉద్యమ స్ఫూర్తిలో భాగంగా భాషాభిమానాన్ని తెలుగు ప్రజలకు కొసరి కొసరి వడ్డించింది. భాష గురించి పద్యాలు, గేయాలు మాత్రమే కాకుండా తెలుగు భాషా మాధుర్యాన్ని సంస్కృత పదయుతంగా దేవులపల్లి 'జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి' అని రచించారు. తెలుగు భాషపై మమకారాన్ని పెంచేందుకు పిల్లల కోసం కూడా పద్యాలు, గేయాలు కూడా వెలిశాయి.

కాబట్టి రాజకీయ, సాంఘిక, చారిత్రక, సాంస్కృతిక అవసరాలను బట్టి దేశంలో ఉద్యమాలు పుట్టుకొస్తాయి. ఆ ఉద్యమాలే ప్రజల హృదయాలలో జాతి, దేశ, భాషాభిమానాలను చివురింపజేస్తాయనడానికి స్వాతంత్ర్యోద్యమకాలంలో దేశంలోనూ, ఆంధ్ర దేశంలోనూ విచ్చుకున్న కవుల గళాలే సాక్ష్యాలు.



బ్రహ్మచారులు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08



పెండ్లికూతురు ముస్తాబు